రాజమహేంద్రవరం ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 41.0 (గురువారం)

కనిష్ఠం : 26.0

కొవ్వూరు మునిసిపాలిటీ టీడీపీ వశం? 6



ఉపయోగాంధ్ర

కడియంలో మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల, కలెక్టర్ ప్రశాంతి తదితరుల యోగాసనాలు

కడియం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): అన్ని వయసుల వారు యోగా సాధన చేయాలని మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. కడియపులంక పుల్లా చంటియ్య - సత్యదేవా నర్సరీలో ఆదివారం యోగాంధ్ర నిర్వహించారు. పచ్చని వాతావరణంలో మంచి ఏర్పాట్లు చేసిన నర్సరీ అధినేత పుల్లా పెదసత్యనారాయణ, నర్సరీ సంఘం అధ్యక్షుడు రత్నం అయ్యప్పలను అభినందించారు. యోగసాధన వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని కలెక్టర్ ప్రశాంతి అన్నారు.కార్యక్రమంలో ఇన్‌చార్జి సర్పంచ్ పాటంశెట్టి రాంజీ, ఏఎంసీ ఉపాధ్యక్షుడు బోడపాటి గోపి, మార్గాని సత్యనారాయణ, పుల్లా వీరవెంకట్రావు, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, మాజీ సర్పంచ్ గట్టి నర్సయ్య, జేసీ చిన్న రాముడు,ఆర్డీవో కృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో శనివారం బక్రీద్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు.. నెహ్రూనగర్, సుబ్రహ్మణ్య మైదానంలో జరిగిన ప్రార్థనల్లో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. - రాజమహేంద్రవరం కల్చరల్

బక్రీద్.. సంబరం



తాళ్లపూడి మండలం సూరయ్యపేటలో పునాది దశలో నిలిచిన ఇంటి నిర్మాణాలు

ఇచ్చేది చాలక.. ఇల్లు కట్టలేక!

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు..అన్నారు పెద్దలు.. ఆ రెండూ అంత కష్టమైన పనులన్న మాట... పెళ్లి మాటేమో కానీ.. ఇల్లు కట్టాలంటే మాత్రం ప్రస్తుత పరిస్థితుల్లో గగనంగా మారింది. ఒక వేళ కష్టపడిన కట్టినా పూర్తవకుండానే అమ్మేసుకుంటున్న వారెందరో.. ఇంటి నిర్మాణం అనేది సాధారణ, మధ్యతరగతి ప్రజలకు కలగానే మారింది. ప్రభుత్వం స్థలం ఇచ్చి ఇళ్లు కట్టుకోమన్నా కట్టుకోలేని స్థితిలో పేదలు ఉన్నారు.

రూ.1.80 లక్షలకు ఇల్లు కట్టగలమా?

2014లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేదల ఆర్థిక సమస్యలను గుర్తించి బ్యాంకు రుణం ఇప్పించి టిడ్కో ఇళ్లు నిర్మించారు.

2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ టిడ్కో ఇళ్లను మూలన పడేసి పేదలకు సెంటుభూమి ఇచ్చి అందులోనే రూ.1.80 లక్షతో ఇల్లు నిర్మించుకోవాలనే విధానాన్ని అమల్లోకి తెచ్చింది.సెంటు స్థలంలో రూ.1.80 లక్షలతో పునాది కూడా పడదు. అయినా చాలా మంది పేదలు అప్పో సప్పో చేసి ఇల్లు కట్టేసుకున్నారు.ప్రస్తుతం ఇళ్లను అమ్మేసుకుంటున్నారు.ఏ కాలనీకి వెళ్లినా ఇల్లు అమ్మబడును అనే బోర్డు లు దర్శనమిస్తున్నాయి.



సూరయ్యపేటలో అమ్మకానికి ఇల్లు

ఇల్లు కట్టాలంటే..అప్పు చేయాల్సిందే..

కూటమి ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి రూ.2.30 లక్షల వరకూ ఇస్తున్నా.. లబ్ధిదారులు ముందుకు రావడంలేదు. ఏదో కొద్దిగా ఆర్థిక స్తోమత ఉన్నవారు మాత్రమే ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారు.ఎందుకంటే గత జగనన్న కాలనీల్లో ఒక్కో లబ్ధిదారుకు ఇచ్చిన 51 గజాల్లో 20 టు 20 అడుగులు మేర ఇల్లు నిర్మించి రంగులతో సహా అందివ్వాలంటే రూ.5.75 లక్షలు అవుతుందని అంచనా ఉంది. బేస్‌మెంట్‌కు రూ.లక్షా 10 వేలు, కిటికీలు, గుమ్మాలు పెట్టి గోడలు కట్టడానికి మరో రూ.1 లక్షా 10 వేలు, శ్లాబ్‌కు రూ.1 లక్షా 20 వేలు,ప్లంబింగ్, ఎలక్ట్రికల్ వర్కుకు రూ.60 వేలు, ప్లాస్టింగ్‌కు రూ.ఒక లక్ష వరకూ అవుతుంది. ఇలా సాధారణంగా కట్టుకుంటే రూ.5.75 లక్షలు అవుతుంది. అయితే ప్రభుత్వం ఇచ్చేది రూ.2.30 లక్షలు అంటే మరో రూ.3.45 లక్షలు అప్పు చేయక తప్పని పరిస్థితి.దీంతో ఇంటి నిర్మాణానికి పేదలు ముందుకు రావడంలేదు. కట్టే ఇంటిపై బ్యాంకు రుణం ఇప్పిస్తే నెమ్మదిగా తీర్చుకుంటామని ఓ లబ్ధిదారుడు చెప్పడం గమనార్హం.

పేదల గూడు..కష్టాలు బోలెడు

- సాయం రూ.2.30 లక్షలు
- అయ్యేది రూ.5.75 లక్షలు
- ముందుకు రాని ప్రజానీకం
- నెరవేరని నిర్మాణ లక్ష్యం
- అధికారులపై తీవ్ర ఒత్తిడి

రూ.2.30 లక్షలు చేసినా ఇబ్బందే..

2024 సార్వత్రిక ఎన్ని కల్లో తెలుగుదేశం హయాంలో కూటమి ప్రభు త్వం అధికారంలోకి రావడంతో పేదలకు భారీ ఎత్తున సహాయ పడాలనే ఆలోచనకు వచ్చింది. ఎస్సీ, బీసీ లబ్ధిదార్లకు రూ.50 వేల వంతున, ఎస్టీలకు రూ.75 వేల వంతున ఆర్థిక సహాయం చేసినా పేదోడు ఇంటి నిర్మాణానికి ఖర్చు సరిపోవడంలేదు. దీంతో చాలా మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి ముందుకు రాలేకపోతున్నారు.తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఈనెల 12వ తేదీకి సామూహిక గృహ నిర్మాణాలకు శంకుస్థాపన చేయాలని ఆదేశించినా ఆర్థిక సమస్యలతో ముందుకు రావడంలేదు.లబ్ధిదారులను ఒప్పించాలని అధికారులు ప్రయత్నించినా వెనకడుగు వేస్తున్నారు.ఉన్నతాధికారులు టార్గెట్లు విధించడంతో సచివాలయ,హౌసింగ్, రెవెన్యూ అధికారులు, ప్రత్యేకాధికారులపై ఒత్తిడి తప్పడం లేదు.



మళ్లీ.. రుతు పవనాలు!

మొన్న మే నెలలో.. ఎక్కడ చూసినా హాయ్ హాయ్..పెద్దగా కానరాని సూరీడు..రోజంతా చల్లదనమే..మబ్బుల చాటున దాగిన సూరీడుతో మండుటెండలు మాయం.. అనేక చోట్ల వర్షాలు.. నిజంగానే ఇది మే నెలేనా అన్నట్టు కానరాని భారీ ఉష్ణోగ్రతలు..ఊసే లేని వడగాడ్పులు.. ఉక్కబోత...హమ్మయ్య ఈ వేసవి ఇక ముగిసిపోయింది.. అని జనం ఊపిరి పీల్చుకున్నారు... ఈలోపు రుతు పవనాల ఆగమనం... ఇక హాయి హాయి అనుకున్నారంతా.. కానీ!

జూన్‌లో చల్లదనమే అనుకున్నారంతా.. కానీ సూరీడు సుర్రుమంటున్నాడు.. ఉదయం నిద్రలేవగానే బయట ఉక్కబోత.. తీవ్రవేడి.. కానరాని వానలు.. ఎండలు జనానికి చుక్కలు చూపిస్తున్నాయి. రుతు పవనాలు వచ్చేశాయనుకుంటే వాన జాడ లేక జనం విలవిల్లాడిపోతున్నారు..

మే నెలలో హాయ్.. జూన్‌లో బాబోయ్!

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

వాతావరణం మారింది.. ఏటా మే నెలో ఎండలు మండిపోతాయి..ఇళ్ల నుంచి బయటకే రాలేం.. జూన్ వచ్చే సరికి వర్షాలు ప్రారంభమై వాతావరణం కొంత చల్లబడుతుంది.ఏళ్ల తరబడి కనిపించే వాతావరణ పరిస్థితులు ఇవే.. అటు వాతావరణ శాఖ కూడా ఏటా మే నెలలో ఎండలు మండిపోతాయని..జూన్‌లో నైరుతి రుతుపవనాలతో పరిస్థితి కాస్త చల్లబడుతుందని చెబుతుంటారు.అదేం విచిత్రమో కానీ.. ఈ సారి వాతావరణం ఉమ్మడి జిల్లాలో జనాలకు చుక్కలు చూపిస్తోంది. మే లో చల్లచల్లని ఆహ్లాదం పంచి..ఇప్పుడు జూన్‌లో వేడి దంచేస్తుంది. వాతావరణశాఖ నిపుణులు సైతం గందరగోళానికి గురైన ప్రస్తుత పరిస్థితులపై రకరకాల విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి.

- ఉక్కబోతతో జనం విలవిల
- సుర్రుమంటున్న సూరీడు
- ఏసీ రూమ్‌లకే జనం పరిమితం
- జూన్‌లో వింత వాతావరణం
- ఈ నెల 12న అల్పపీడనం

చల్లదనమే!

ఈ ఏడాది రొటీన్‌కు భిన్నంగా కాస్త చల్లదన'మే' అనిపించాయి. ఉదయం ఎంత భానుడు విశ్వరూపం చూపినా.. సాయంత్రమయ్యేసరికి మాత్రం వరుణుడు కూల్ చేసేవాడు. ప్రతి రోజూ ఉమ్మడి జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిశాయి. కాకినాడ, కోనసీమ, రాజమహేంద్రవరం నగరాల్లో మే నెలలో అనేక సార్లు భారీ వర్షాలతో వర్షపాతం ఏకంగా ఆరు సెంటీమీటర్ల వరకు నమోదైంది. ఈ మూడు జిల్లాల్లో ఏకంగా అనేక మండలాల్లో వరుసగా 8 రోజులు వర్షం కురిసింది. దీంతో మే నెలంతా చల్లచల్లగా గడిచింది.కాకినాడ జిల్లాలో ఏప్రిల్‌లో 16.4 మి.మీ వర్షపాతం నమోదుకావాల్సి ఉంటే 45.78 మి.మీ. కురిసింది. మేలో 109 మి.మీ.కు 115 మి.మీ. నమోదైంది. జూన్‌కు వచ్చేసరికి 8.1 మి.మీ. తక్కువ నమోదైంది.కోనసీమ జిల్లాలో మే నెలంతా కలిసి 72.55 మి.మీ. వర్షం కురవాల్సి ఉంటే 130 మి.మీ. కురిసింది. జూన్‌లో ఈ ఏడు రోజుల్లో ఒక్కరోజు వర్షం నమోదవలేదు.0.65 మి.మీ. లోటు కనిపిస్తోంది. తూర్పు గోదావరి జిల్లాలో మే నెలంతా కలిపి 78.56 మి.మీ. వర్షం కురవాల్సి ఉంటే 135.54 మి.మీ. కురిసింది. తీరా జూన్‌కు వచ్చేసరికి ఏడు రోజుల్లో 0.76 మి.మీ. లోటు కొనసాగుతోంది.

బాబోయ్ జూన్..

జూన్ నెల ఆరంభం కాగానే అంతా వర్షాలే అనుకున్నారు.తీరా చూస్తే ఎండలు మండిపోతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు 35 డిగ్రీల నుంచి 40 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. మూడు రోజులుగా సూరీడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు.ఆ ప్రచండభానుడి భగభగలతో ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు.ఉదయం ఆరు గంటల నుంచే వాతావరణం ఉక్కబోతగా ఉంటోంది. పది గంటలకే 'ఉక్క'రూపం దాల్చుతోంది. మధ్యాహ్నం పూర్తిగా నడినెత్తిన చేరుతోంది. ఇదే పరిస్థితి మరికొన్ని రోజులు ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.ఈ నెల పదో తేదీన పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడవచ్చని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు.ఈ నెల 12న బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందని అంచనా. ప్రస్తుత వాతావరణానికి కారణం మందగించిన రుతుపవనాల కదలికే అని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఇవి మందకొడిగా ఉండడమే ప్రస్తుత పరిస్థితికి కారణమని విశ్లేషిస్తున్నారు.

ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీలో జిల్లాకు 18వ స్థానం

రాజమహేంద్రవరం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలో మెరుగైన ఫలితాలు సాధించిన జిల్లా సప్లిమెంటరీలో 18వ స్థానంతో సరిపెట్టుకుంది. శనివారం వెలువడిన ఫలితాల ప్రకారం.. ప్రథమ సంవత్సరం జనరల్ విభాగంలో 3,891 మంది పరీక్షలు రాయగా 1,636(42%) మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ విద్యార్థులు 2,624 మంది హాజరు కాగా 1,437(55%) మంది..ఒకేషనల్‌లో మొదటి ఏడాది 819కి 394, రెండో ఏడాది 542కు 316 మంది పాసయ్యారు. రీవెరిఫికేషన్, రీకౌంటింగ్‌కి ఈ నెల 13 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి నరసింహం తెలిపారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

మంత్రి కందుల దుర్గేష్ ఆదేశం

రాజమహేంద్రవరం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు ఆర్‌వోబీ నిర్మాణ పనులు వేగవంతం చేసే క్రమంలో రైతులకు ఎలాంటి ఇబ్బందీ కలిగించడానికి వీల్లేదని.. అధికారులతో కూడిన నిపుణల కమిటీ క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి తగిన ప్రతిపాదనలతో నివేదికను త్వరితగతిన అందజేయాలని మంత్రి కందుల దుర్గేష్ ఆదేశించారు.కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శనివారం కలెక్టర్ ప్రశాంతి, రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజనీరు వీపీఎస్ నాయుడుతో సమావేశం నిర్వహించారు. వంతెన నిర్మాణంలో రైతులు వెల్లడిస్తున్న అభ్యంతరాలకు సహేతుకమైన పరిష్కారాలు చూపాలన్నారు.కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ఇప్పటికే ప్రాజెక్టుకు సంబంధించి క్షేత్రస్థాయిలో సింగవరం, శెట్టిపేట,తాళ్లపాలెంలో గ్రామ సభలు నిర్వహించామన్నారు.ఈ వంతెన వల్ల జిల్లాకు ప్రత్యేక గుర్తింపు వస్తుందన్నారు.



ఏదీ ఫుట్‌పాత్ : రాజమహేంద్రవరంలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు





వాణిజ్య నగరం.. ప్రయాణం నరకం!

రాజమహేంద్రవరం వస్తే తప్పని ట్రాఫిక్ ఇక్కట్లు

- ఫుట్‌పాత్‌లని వదలని వ్యాపారులు
- ఎటెల్లాలో తెలియక రోడ్డుపై జనం
- చాలా చోట్ల పనిచేయని సిగ్నల్స్
- ఎక్కడపడితే అక్కడే పార్కింగ్‌లు
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరం నగరంలో ట్రాఫిక్ సమస్య భయపెడుతోంది..ఎవరిష్టం వారిదే.. ట్రాఫిక్ సిగ్నల్స్ ఉన్నా పనిచేయవు.. పనిచేసినా పట్టించుకోరు. పలు చోట్ల ఫుట్‌పాత్‌లు ఆక్రమణ, పార్కింగ్ స్థలాలు లేకపోవడం వంటి సమస్యలతో సిటీ సతమతమవుతోంది. 7 లక్షల జనాభా ఉన్న వాణిజ్య నగరానికి ప్రతి రోజూ వేలాదిగా బయట నుంచి జనం వచ్చి వెళుతుంటారు. వాహనాలను ఇష్టానుసారం రోడ్లపై పెట్టేస్తున్నారు. ప్రజలు నడవడానికి వీలుగా నిర్మించిన ఫుట్‌పాత్‌లు ఆక్రమించేస్తున్నారు. ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేస్తున్నారు. లాలా చెరువు రోడ్డులో కార్ల షోరూమ్‌లు, మెకానిక్‌లు తమ వాహనాలు ఏకంగా ఫుట్‌పాత్‌ల మీదే పార్కింగ్ చేయడం గమనార్హం. ట్రాఫిక్ పోలీసుల విధానం సక్రమంగా ఉన్నట్టు లేదు. ఎవరూ ట్రాఫిక్ సమస్యపై దృష్టి పెట్టడం లేదు. చాలా జంక్షన్లలో ట్రాఫిక్ సిగ్న ల్స్ లేవు. బస్సు రూట్‌లు హైవేకే మళ్లిస్తే ట్రాఫిక్ సమస్య తీరుతుంది. కడియపులంక, వేమగిరి, బొమ్మూరు, ఫోర్త్ బ్రిడ్జి, దివాన్ చెరువు సెంటర్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ అభివృద్ధి చేయవలసి ఉంది. ఫుట్ పాత్‌లు ఆక్రమించే వారి జోలి కి మాత్రం సిటీ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ వెళ్లక పోవడం గమనార్హం.చిరు వ్యాపారులు ము నిసి పల్ సిబ్బంది,సిటీ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్, పో లీసులకు నెలవారీ మామూళ్లు ఇవ్వాల్సిందే. 2027లో గోదావరి పుష్కరాలు వస్తున్నాయి. ఆలోగానే ట్రాఫిక్ సమస్యకు ఒక పరిష్కారం చూపాల్సి ఉంది. లేదంటే ప్రమాదమే. అధికారులు కాస్త ముందుగా మేల్కొంటే సమస్యను పరిష్కరించే అవకాశం ఉంటుంది. అప్పుడు చేద్దామంటే హడావుడి తప్ప ఏమీ ఉండదు.



ఇరుకుగా దేవీచౌక్



నడవడానికే చోటుండదు : ఇదీ రాజమహేంద్రవరం మెయిన్‌రోడ్డు

10న టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం

వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

రాజమహేంద్రవరం, జూన్7(ఆంధ్రజ్యోతి): యువత, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, విద్యార్థుల ద్వారా ప్రతిపాదించే నూతన ఆవిష్కరణలకు ఆర్థిక, సాంకేతిక చేయూత ఇవ్వడానికి రతన్‌టాటా ఇన్నో వేషన్ హబ్ (ఆర్టీహెచ్) కార్యాలయం ఏర్పాటు చేస్తున్నట్టు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్ బొమ్మూరులో అందంగా తయారు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ కార్యాలయంలో కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.ఈ కేంద్రాన్ని ఈ నెల 10న సీఎం చంద్రబాబు వర్చువల్‌గా ప్రారంభిస్తారన్నారు. ఈ మేరకు రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు కాటంనేని భాస్కర్, పీఎస్ ప్రద్యుమ్న జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో శనివారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ ఆర్టీహెచ్‌కు లీడ్ పార్టనర్‌గా గ్రీన్‌కో ఉందన్నారు. ఈ హబ్ కోసం ఐదుగురు ప్రతినిధులు, ఇద్దరు స్వతంత్ర నిపుణులతో ప్రమోషన్ కోసం టీమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, పరిశ్రమ నిర్వాహకుల సంఘాల నుంచి ఇద్దరు ప్రముఖులను ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. దిశ, పాలనను పర్యవేక్షించే బాధ్యత, పెట్టుబడి, ఫైనాన్సింగ్ భాగస్వామ్యం, ఇంక్యుబేషన్, అండ్ యాక్సిలరేషన్, వాటాదారుల నిర్వహణ విషయంలో తగిన మార్గదర్శకం ఉండేలా హబ్ కార్య కలాపాలు ఉంటాయన్నారు.ఈ హబ్ ఏర్పాటు, నిర్వహణ విషయంలో సహ భాగస్వామ్యం, కార్పస్ ఫండ్ రూ.30కోట్లతో వెంచర్ క్యాపిటల్ ఫండ్ ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తారని చెప్పారు.



ముస్తాబవుతున్న టాటా ఇన్నోవేషన్ కేంద్రం

జిల్లాకు 42 కిసాన్ డ్రోన్లు మంజూరు

రాజమహేంద్రవరం రూరల్ జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సబ్సిడీపై కిసాన్ డ్రోన్లతో గ్రామ వ్యవసాయ యంత్రాల బ్యాంకుల స్థాపన రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేసిందని కలెక్టర్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయ యాంత్రీకరణ రైతు కృషి విజ్ఞాన యోజన 2024-25 పథకంలో 42 కిసాన్ డ్రోన్లను మంజూరు మంజూరు చేయడం జరిగిందన్నారు. డ్రోన్ యూనిట్స్ ఏర్పాటుకు ఐదుగురు సభ్యులు కలిగిన రైతు సీహెచ్‌సీలో సభ్యుల ఆమోదంతో ఒకరికి డ్రోన్ టెక్నాలజీ పైలెట్‌గా శిక్షణ ఇస్తారన్నారు. అభ్యర్థి వయసు 18 నుంచి 50 సంవత్సరాల్లోపు ఉండి ఇంటర్మీడియట్ అర్హత ఉండాలన్నారు. రైతు సీహెచ్‌సీ సభ్యులు వివరాలు ధ్రువీకరించిన తరువాత వ్యవసాయాధికారుల ద్వారా జిల్లా కలెక్టరు ఆమోదం నిమిత్తం సిఫారసు చేస్తారన్నారు. జిల్లాకు 42 డ్రోన్ యూనిట్స్ మంజూరు కాగా ప్రస్తుతం 32 డ్రోన్లకు అనుమతివ్వడం జరిగిందన్నారు. ఇప్పటికే 12 డ్రోన్స్ ఏర్పాటు చేయడం జరిగిందని మరో 12 డ్రోన్లు పంపిణీకి సిద్ధం చేయడం జరిగిందన్నారు. చాగల్లు మండలం 1, గోపాలపురం మండలం-1, నల్లజర్ల మండలం-3, రంగంపేట మండలం-1, ఉండ్రాజవరం మండలం-1, తాళ్ళపూడి మండలం-1, గోకవరం మండలం-2, సీతానగరం మండలం-1, దేవరపల్లి మండలం-1 ఉన్నాయన్నారు.

సృజనకు చుక్కాని.. నైపుణ్యానికి సాన

రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్

ఆర్‌టీఐహెచ్ భవనానికి తుది మెరుగులు



(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

సానపట్టే కొద్దీ పదునెక్కే యంత్రాలు యువత బుర్రలు.. ఆ మదిలో ఎన్నో ఐడియాలు.. అడుగు వేద్దామంటే ఆర్థిక ఇబ్బందులు. కొత్తగా ఏదైనా చేద్దామనే తపన.. చేతిలో చిల్లిగవ్వ లేని నిస్సహాయత.. తెలివి తేటలకు కొదువ ఉండదు.. కానీ తెల్లారితే రెక్కాడాల్సిందే.. కాస్త ప్రోత్సాహం వారి భుజం తట్టేటట్లు ఉంటే?.. అద్భుతాలు ఆవిష్కృతమవుతాయి. ప్రభుత్వం అలాంటి ప్రయత్నమే మొదలు పెడుతోంది. అంతరాలను అధిగమింపజేసి శిఖరాలను అందుకునేలా అంకురాలకు (ఎంట్రప్రెన్యూర్స్) పదును పెట్టబోతోంది. 'వన్ ఫ్యామిలీ- వన్ ఎంట్రప్రెన్యూర్' దిశగా వేసిన అడుగే 'రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్(ఆర్‌టీఐహెచ్)'లు. ఇవి యువతలో ఉన్న సృజనకు చుక్కాని కానున్నాయి. ప్రభుత్వం యువత విషయంలో ఓ వైపు ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తూనే.. మరోవైపు సొంత కాళ్లపై నిలబడి పదిమంది జీవితాలను కూడా ఉన్నత స్థాయికి తీసుకెళ్లే పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి ఊతంగా నిలబడుతోంది. ఆకలేస్తే చేపను ఇవ్వడం కంటే.. చేపను పట్టడం నేర్పితే ఆకలికి అవకాశం ఉండదని పెద్దలు ఏనాడో చెప్పారు కదండీ!. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం గ్రామీణంలోని బొమ్మూరులో ఆర్ఐటీహెచ్‌ని సీఎం చంద్రబాబు వర్చువల్ విధానంలో ప్రారంభించనున్న సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.





పనులు చేస్తున్న దృశ్యం

- యువత భవితకు భరోసా..
- రాష్ట్రంలో ఐదు.. అందులో మనకూ ఒకటి
- ఉభయగోదావరి జిల్లాల యువత నైపుణ్యానికి పదును
- పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడమే ధ్యేయం
- ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యం
- ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని బొమ్మూరులో ఆర్ఐటీహెచ్‌ని వర్చువల్‌గా ప్రారంభించను న్న సీఎం చంద్రబాబు

ఏమిటీ హబ్‌లు?

ప్రైవేటు భాగస్వామ్యంతో యువతలో ఉన్న సృజనాత్మకతకు పదును పెట్టడం ద్వారా నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం అందించడం ఈ హబ్‌ల ముఖ్య ఉద్దేశం. యువతలో మెరిసిన ఆలోచనను ఒడిసి పట్టుకొని మెరుగుపెడితే వారి ఎదుగుదలతోపాటు అభివృద్ధి, జీవన ప్రమాణ మెరుగుదలకు ఉపయోగపడే ఎన్నో నూతన విషయాలకు రూపం పోయవచ్చు. ఈ దిశగా ప్రయత్నాలు చేయడం కోసమే రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. కొత్త ఆవిష్కరణలు చేయడం, సవాళ్లను ఎదుర్కోవడం, అధిగమించడం వంటివి చేయడంలో యువతకు, పరిస్థితులకు మధ్య ఉన్న అంతరాలను తొలగించి వారధిగా అవి నిలుస్తాయి. ఇప్పటికే ఆర్‌టీఐహెచ్ వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న టాటాగ్రూప్, టాటాసన్స్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్‌తో సీఎం చంద్రబాబు మాట్లాడారు. పారిశ్రామిక దిగ్గజాలైన ఓఎన్‌జీసీ, టాటా గ్రూప్, ఎల్‌అండ్‌టీ, రేమండ్, అదానీ పోర్ట్సు, ఆర్సెలార్ మిట్టల్, నిప్పాన్ స్టీల్, గెయిల్ వంటి సంస్థలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి ఆర్‌టీఐహెచ్‌ని సమర్థవంతంగా నిర్వహించేలా కార్యాచరణ రూపొందించారు. ప్రతి కుటుంబం నుంచీ ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే సీఎం చంద్రబాబు సంకల్పంతో ఈ హబ్‌లు ఏర్పాటు అవుతున్నాయి. ఈ కలను సాకారం చేయడానికి పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ సంస్థలు, ప్రొఫెసర్లు, మేధావులు ముందుకు రావాలని ఇప్పటికే ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని యువతను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడానికి ఏపీ హబ్‌ని ఏర్పాటు చేయాలని ఆలోచన చేశారు. ఆ హబ్‌కి గొప్ప వ్యక్తి పేరు పెట్టాలని సంకల్పించి 'రతన్ టాటా' పేరు పెట్టారు.

యువతకు పూర్తి సహకారం

రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లు యువత భవితకు భరోసా అని చెప్పవచ్చు. స్టార్టప్‌లతో వచ్చే యువతకు పూర్తి సహకారం అందించే మార్గాన్ని చూపుతారు. మహిళలు, యువత, నైపుణ్యం కలిగిన వారికి ప్రాధాన్యం ఇస్తారు. అంతర్జాతీయ స్థాయిలో నైపుణ్యాభివృద్ధి ద్వారా పోటీతత్వంతో మార్కెటింగ్ చేసుకొనే విధానాలపై అవగాహన కల్పిస్తారు. హబ్‌ల నిర్వహణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సామాజిక బాధ్యత కింద దిగ్గజ పారిశ్రామిక సంస్థలు నిధులు సమకూరుస్తారు. యువతలో వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాభివృద్ధి, పోటీతత్వం వంటి వాటిలో శిక్షణ ఇస్తారు. ప్రభుత్వం అందించే వివిధ పౌర సేవల్లోనూ ఆర్‌టీఐహెచ్ భాగస్వామ్యం అవుతుంది. భవిష్యత్తు టెక్నాలజీలైన క్వాంటమ్, కృత్రిమ మేధ వంటి రంగాల్లోని స్టార్టప్‌లకు సహకారం అందిస్తారు. వ్యవసాయం, ఆక్వా, మెరైన్, టెక్స్‌టైల్ ఇన్నోవేషన్, అపెరల్, ఫైబర్, ఇంధనం, క్లీన్‌టెక్, పునరుత్పాదన ఇంధనం, లైఫ్‌సైన్స్, ఫార్మా అండ్ హెల్త్, అనుబంధ రంగాల్లో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తారు. పట్టణ పౌర, వాణిజ్య రవాణా, జలరవాణా, గ్రామీణ మహిళా పారిశ్రామిక, వాణిజ్యవేత్తలకు శిక్షణ ఇస్తారు. నైపుణ్యాలను వెలికితీసి అభివృద్ధి చేస్తారు.

రాజమహేంద్రవరంలో ఏర్పాటు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరంలో టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేస్తున్నారు. బొమ్మూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఇప్పటికే భవనానికి తుది మెరుగులు దిద్దుతున్నారు. ఇది ఉభయగోదావరి జిల్లాల యువతకు వరమని చెబుతున్నారు. గవర్నింగ్ బాడీకి గ్రీన్ కో ఎనర్జీ, ఓఎన్‌జీసీ, గెయిల్, అవంతి సీడ్స్ తదితర సంస్థలు ప్రమోటర్లుగా వ్యవహరించనున్నారు. యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఈ హబ్‌ల్లో కృషి జరుగుతుంది. రాష్ట్రంలోని విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, అనంతపురంతోపాటు హబ్ ఏర్పాటు అదృష్టం రాజమహేంద్రవరానికి దక్కింది. దీంతో చారిత్రక నగరం భవిష్యత్తుల్లో స్టార్టప్‌లకు కీలక కేంద్రంగా మారే అవకాశం కనిపిస్తోంది. యువతకు ఉద్యోగాల కల్పన, నైపుణ్యాభివృద్ధి, నూతన పారిశ్రామికవేత్తలను తయారు చేయడం, స్టార్టప్‌లను ప్రోత్సహించడం, నూతన ఆవిష్కరణలే లక్ష్యంగా రాజమహేంద్రవరం ఆర్ఐటీహెచ్ ముందుకు సాగనుంది. ఈ హబ్‌లో కంప్యూటర్లు, హైస్పీడ్ ఇంటర్‌నెట్ సదుపాయాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నారు. వర్క్ ఫ్రం హోం ద్వారా విధులు నిర్వర్తించే యువత ఇక్కడినుంచి పనిచేసుకునే వెసులుబాటును కల్పించనున్నారు. కొన్ని సదుపాయాలకు రుసుములు విధించే అవకాశం ఉంది. కలెక్టర్ ప్రశాంతి ఆధ్వర్యంలో పనుల పర్యవేక్షణపై నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ పూర్తిగా దృష్టిసారించారు. సహ-ప్రమోటర్లు, ప్రతినిధుల నుంచి ఐదుగురు అధ్యక్షులు, ఇద్దరు స్వతంత్ర నిపుణులతో కూడిన బృందాన్ని నియమించారు. నిర్వహణతోపాటు భాగస్వామ్యం, కార్పస్ ఫండ్, రూ.30 కోట్ల వెంచర్ క్యాపిటల్ ఫండ్ ఏర్పాటు చేస్తున్నారు. పూర్తి విధి విధానాలు త్వరలోనే ప్రకటించనున్నారు. యువత తమ ఆలోచనలకు పదును పెట్టి 'ఆర్ఐటీహెచ్'లను ఒడిసి పట్టుకొంటే బంగారు భవిష్యత్తును అందిపుచ్చుకోవడానికి మార్గం సుగమమైనట్లేనని చెప్పడంఅతిశయోక్తి కాదు.

బాలబాలాజీ సన్నిధిలో పండిత సదస్యం

● కల్యాణోత్సవాల్లో ప్రత్యేక పూజలు ● భక్తుల కోలాహలం

మామిడికుదురు, జూన్7(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ కల్యాణోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు జరిగాయి. కల్యాణోత్సవాలు, శనివారం కావడంతో దేవస్థానం భక్తుల కోలాహలంతో కళకళ్లాడింది. ఆలయ ఉపముఖ్య అర్చకులు గొడవర్తి శ్రీనివాచార్యులు, వేదపండితులు జోస్యుల సోమయాజులు ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, శ్రీవారికి సహస్ర నామార్చాన, బాలబోగ నివేదన, చతుష్టానార్చనలు, వేద పారాయణం, హోమాలు, బలిహరణ, తీర్థ ప్రసాద గోష్ఠి, సదస్యం, వేద పారాయణం, నిత్య హోమం తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా చేశారు.



బాలబాలాజీ సన్నిధిలో భక్తుల రద్దీ

ఉభయ గోదావరి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 30మంది వేదపండితుల ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం వేద సదస్యం కార్యక్రమాన్ని



బాలబాలాజీ సన్నిధిలో పండిత సదస్యం చేస్తున్న పండితులు

శాస్త్రోక్తంగా చేశారు. శనివారం స్వామివారిని 580మంది భక్తులు దర్శించుకుని, నిత్యాన్నదాన పథకంలో 3500 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారని, వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.4,16,615 ఆదాయం వచ్చిందని సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా సహాయ కమిషనర్, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

తొలి తిరుపతికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొలి తిరుపతి శృంగార వల్లభస్వామి క్షేత్రానికి శనివారం సుమారు 10వేల మందికిపైగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి అర్చకులు పెద్దింటి పురషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులువిశేషపూజలు, అభిషేకాలు చేశారు. రూ.3,39,087 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.



విశేష అలంకరణలో శృంగార వల్లభ స్వామి

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం



వెంకన్న ఆలయంలో భక్తుల రద్దీ, స్వామి వారు



ఆత్రేయపురం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలభోగం నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు తిరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ లైన్లలో స్వామిని దర్శించుకున్న భక్తులు తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారికి ఒక్కరోజు ఆదాయం రూ.61.73 లక్షలు లభించినట్టు ఉప కమిషనరు నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు. ఇదిలా ఉండగా వెంకన్న క్షేత్రంలో నవ్మక్ వార్తి రున క్షత్ర ఉత్సవాలు మూడో రోజు శనివారం నిర్వహించారు. వేదపారాయణం, పల్లకి మహోత్సవం కన్నుల పండువగా జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సౌకర్యాల కల్పనకు ప్రత్యేక చర్యలు

వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు సకల సౌకర్యాలు కల్పించేందుకు

స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.61.73 లక్షలు

ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు పేర్కొన్నారు. శనివారం ఆలయం వద్ద జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశాల మేరకు భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నామన్నారు. భక్తుల క్యూ వద్ద కూలర్లు, ఫ్యాన్లు, దాహార్తి తీర్చేందుకు మజ్జిగ, తాగునీరు అందిస్తున్నామన్నారు. చిన్నపిల్లలకు పాలు, బిస్కెట్లు సైతం పంపిణీ చేస్తున్నామన్నారు. ఆలయ ప్రకార మండపంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి భక్తుల సమస్యలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్టు చెప్పారు. ప్రతి శనివారం సుమారు 50నుంచి 60వేల మంది స్వామిని దర్శించుకుంటున్నారని, 20 నుంచి 30 వేల మంది అన్నప్రసాదం స్వీకరిస్తున్నారన్నారు. త్వరలోనే భక్తులకు డార్మిటరీ నిర్మాణం, వసతి గదులు, ఉచిత బస్సు సౌకర్యం, సోలార్‌లైట్లు, ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. ఆలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్టు ఉపకమిషనరు తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి ముదునూరి వెంకట్రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

కోటసత్తెమ్మ సన్నిధిలో బూరుగుపల్లి పూజలు



పూజలు చేస్తున్న శేషారావు దంపతులు

నిడదవోలు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): తిమ్మ రాజుపాలెంలో వేంచేసి వున్న కోట సత్తెమ్మ వారిని శనివారం రాష్ట్ర స్కిల్ డెవలప్మెంటు కార్పొ రేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు తన కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు శేషారావు దంపతులకు వేద ఆశీర్వాదాలు అందజేశారు. ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రవిశంకర్ ఆలయ ఆచార ప్రకారం శేషారావు దంపతులను సత్కరిం చారు. కార్యక్రమంలో బూరుగుపల్లి శ్రీనివాస్, టీడీపీ మండలాధ్యక్షుడు వెలగన సూర్యా రావు, దేవస్థానం సూపరింటెండెంట్ జల్లా సోమరాజు పాల్గొన్నారు.

పేపర్‌లెస్ డాక్యుమెంట్ల విధానాన్ని రద్దు చేయాలి

ఏపీ దస్తావేజు లేఖరుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సుబ్బారావు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పేపర్‌లెస్ డాక్యుమెంట్ విధానాన్ని రద్దు చేయాలని ఏపీ దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు బీఎస్‌వీ సుబ్బారావు డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరంలో శనివారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం అమలుకు సిద్ధం చేసిన ల్యాండ్ టైటిల్ యాక్టును కూటమి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. అయితే ఇప్పుడు ఇదే చట్టాన్ని కేంద్రం పేపర్ లెస్ డాక్యుమెంట్ పేరుతో మళ్లీ తెరమీదకు తీసుకువస్తుందన్నారు. ఈ విధానంపై ఈనెల 25 లోపు దస్తావేజు లేఖర్ల అభ్యంతరాలు తెలియజేయమని కేంద్ర ప్రభుత్వం కోరిందన్నారు. ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరంలో దస్తావేజు లేఖర్ల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించుకున్నామన్నారు. కేంద్రం అమలు చేయాలనుకుంటున్న విధానం వల్ల రాష్ట్రంలో లక్షకు పైబడి దస్తావేజు లేఖరులు, వారిపై ఆధారపడి జీవనం సాగించే కంప్యూటర్ ఆపరేటర్లు రోడ్డున పడతారన్నారు. దస్తావేజు లేఖర్ల వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నల్లిమిల్లి వీర్రెడ్డి మాట్లాడుతూ తమ రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో పేపరులెస్ విధానాన్ని వ్యతిరేకిస్తూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రులకు, ఎంపీ, ఎమ్మెల్యేలను కలిసి వినతులు అందిస్తామన్నారు.సమావేశంలో లేఖర్ల సంఘం రాష్ట్ర లీగల్ అడ్వైజర్ బీజే ప్రసాద్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గాదె రవికుమార్, సంఘం జేఏసీ సభ్యుడు మజ్జి గణపతిరావు, ఎస్‌హెచ్‌వీ రామకృష్ణ, రాజమహేంద్రవరం అధ్యక్షుడు కోలా రామచంద్రరావు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో తిరుమల ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్ జూన్ 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్‌మీడియట్ ప్రథమ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో రాజమహేంద్రవరంలోని తిరుమల జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్టు విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఎంపీసీ విభాగంలో 470 మా ర్కులకు గాను 467 మార్కులు 24 మంది విద్యార్థులు సాధించారన్నారు. 466 మార్కులకు పైన 155 మంది, 465కు పైన 506 మంది, 463కు పైన 1224 మంది 460కు పైన 1775 మంది, 450కు పైన 2604 మంది సాధించారన్నారు. బైపీసీలో 440 మార్కులకు 437 మార్కులు మోహ్మద్ మనీష, గంగేయుల కృష్ణ చందన, కాడా గాయత్రి, గంపల వీర వెంకటలక్ష్మణ్ సాధించారు. 435 మార్కులు పైన 90 మంది, 430కు పైన 292 మంది, 400కు పైన 501 మంది సాధించారన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్లతో కలిసి తిరుమలరావు అభినందించారు.

'ఆదిత్య' విద్యార్థుల ప్రతిభ

కాకినాడ రూరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఇంటర్ బెటర్‌మెంట్ ఫలితాల్లో ఆదిత్య జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరచి అత్యుత్తమ మార్కులు సాధించినట్టు ఆదిత్య కార్యదర్శి ఎన్.కృష్ణదీపక్‌రెడ్డి తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 12మంది విద్యార్థులు 470 మార్కులకు గానూ 466 మార్కులు సాధించారన్నారు. అలాగే 54మంది విద్యార్థులు 465 మార్కులను, 79మంది 464 మార్కులను పొందినట్టు తెలిపారు. బైపీసీలో 440 మార్కులకుగానూ ఇద్దరు విద్యార్థినులు 436 మార్కులను, తొమ్మిది మంది 435, ఏడుగురు 434 మార్కులు, ఎనిమిది మంది 433 మార్కులు సాధించారన్నారు. ఎంఈసీలో 500 మార్కులకుగానూ ఒక విద్యార్థి 493, ఇద్దరు 492, ఇద్దరు 491, ఇద్దరు 490 మార్కులు పొందినట్టు తెలిపారు. సీఈసీలో 500 మార్కులకు గానూ ఒకరు 491, ఒక విద్యార్థి 483 మార్కులు సాధించారన్నారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి అభినందించారు.

కొవ్వూరు మున్సిపాల్టీ కూటమి కైవశం

- వైసీపీకి మున్సిపల్ చైర్‌పర్సన్, ముగ్గురు కౌన్సిలర్లు రాజీనామా
- టీడీపీలో చేరనున్నట్లు ప్రకటన
- మెజార్టీ కోల్పోయిన ప్రతిపక్షం



అచ్చిబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న చైర్‌పర్సన్ రత్నకుమారి, కౌన్సిలర్లు

కొవ్వూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మున్సిపాల్టీ టీడీపీ వశమైంది. తాజాగా వైసీపీకి చెందిన నలుగురు మున్సిపల్ కౌన్సిలర్లు రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. కొవ్వూరు మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, 3వ వార్డు కౌన్సిలర్ వరిగేటి లలితకుమారి, 10వ వార్డు కౌన్సిలర్ బత్తి నాగరాజు, 15వ వార్డు కౌన్సిలర్ అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, మాజీ కౌన్సిలర్ బావన రాజేష్, వరిగేటి సుధాకర్ వ్యక్తిగత కారణాలతో, పట్టణాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని వైసీపీకి రాజీనామా చేస్తున్నట్టు శనివారం పాత్రికేయుల సమావేశంలో తెలిపారు. అనంతరం స్థానిక టీడీపీ నియోజకవర్గ కార్యాలయానికి చేరుకుని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్యుతరామయ్య (అచ్చిబాబు)లను కలుసుకుని పుష్పగుచ్చాలు అందించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆసక్తితో తెలుగుదేశం పార్టీలో చేరనున్నట్టు ప్రకటించారు. దీనిపై ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ త్వరలో సీఎం చంద్రబాబు సమక్షంలో నలుగురిని పార్టీలో చేర్చుకోనున్నట్టు తెలిపారు.

మెజార్టీ కోల్పోయిన వైసీపీ

కొవ్వూరు మున్సిపాల్టీలో 23 వార్డులు ఉండగా గత ఎన్నికల్లో వైసీపీ 15, టీడీపీ 7, బీజేపీ 1 వార్డు గెలుచుకున్నాయి. వైసీపీ నుంచి చైర్‌పర్సన్‌గా బావన రత్నకుమారి ఎన్నికయ్యారు. తాజాగా శనివారం వైసీపీ నుంచి 4 కౌన్సిలర్లు వైసీపీకి రాజీనామా చేశారు. అందులో మున్సిపల్ చైర్‌పర్సన్ ఒకరు. దీంతో వైసీపీ బలం 15 నుంచి 11కి పడిపోగా టీడీపీ సంఖ్య 11కు చేరింది. బీజేపీ 1, ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఎమ్మెల్యే ఓటుతో కలుపుకుని కూటమి బలం 13కు చేరింది. దీంతో కొవ్వూరు మున్సిపాల్టీ టీడీపీ వసం అవ్వడం దాదాపుగా ఖరారయ్యింది.

కొవ్వూరులో శనివారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి మాట్లాడుతూ వ్యక్తిగత కారణాలతో వైసీపీకి రాజీనామా చేస్తున్నానన్నారు. పార్టీ మారడంలో ఎవ్వరి ప్రలోభాలు లేవని, పూర్తిగా తమ సొంత నిర్ణయమన్నారు. కొవ్వూరు పట్టణాభివృద్ధిని కాంక్షిస్తూ కూటమి ప్రభుత్వం విధివిధానాలతో నచ్చడంతో సీఎం చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరనున్నట్టు పేర్కొన్నారు.

'వైసీపీలో బీసీలకు సముచిత స్థానం లేదు'

10వ వార్డు కౌన్సిలర్ బత్తి నాగరాజు మాట్లాడుతూ 2014, 19, 24 మూడు ఎన్నికల్లో వైసీపీ తరపున పనిచేశాను. ప్రస్తుతం కౌన్సిలర్‌గా పని చేస్తున్నాను. వైసీపీలో బీసీలకు సముచిత స్థానం కల్పించడం లేదన్నారు. గత మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ 15వార్డులు విజయం సాధించి మున్సిపాల్టీని కైవసం చేసుకున్నప్పటికీ చైర్పర్సన్ ఎస్సీలకు రిజర్వు అయ్యింది. 2 వైస్‌చైర్మన్ పదవులు ఉండగా రెండూ ఓసీలకే కట్టబెట్టారు. అలాగే ఇటీవల నియోజకవర్గంలో పట్టణ, మూడు మండలాల అధ్యక్షులను మార్పుచేశారు. 3 మండలాల్లో ఏ సామాజికవర్గం అభ్యర్థిని మార్చితే అదే సామాజికవర్గం వారిని నియమించారు. కొవ్వూరులో అధ్యక్ష పదవి నుంచి బీసీ అభ్యర్థిని తొలగించి ఓసీలకు కట్టబెట్టారు. దీంతో మనస్తాపం చెంది వైసీపీకి రాజీనామా చేసి అన్నిరంగాలలో బీసీలకు పెద్దపీట వేస్తున్న తెలుగుదేశం పార్టీలో చేరుతున్నానన్నారు.

15వ వార్డు కౌన్సిలర్ అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర మాట్లాడుతూ వార్డు ప్రజలు, అభిమానుల కోరిక మేరకు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరుతున్నామని చెప్పారు.

కాకినాడలో మెగా యోగా

- రికార్డుస్థాయిలో ఏడువేలమందితో యోగాసనాలు
- ఆకట్టుకున్న ఓంకారం.. కిలోమీటరు మేర కార్యక్రమం
- యోగాసనాలు వేసిన ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు
- ఉత్సాహంగా పాల్గొన్న ఉపాధ్యాయులు, అధికారులు, యువత
- ప్రతిఒక్కరి దైనందిన జీవితంలో యోగా భాగం కావాలి
- కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్





యోగా కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజలు.. యోగాపై వివరిస్తున్న రామానంద



ఓంకార రూపంలో ఏర్పడిన దృశ్యం



యోగా చేస్తున్న ఎమ్మెల్సీ పద్మశ్రీ



జేసీ రాహుల్‌మీనా



కమిషనర్ భావన

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 7(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఏడువేల మందితో యోగాంధ్ర కార్య క్రమం నిర్వహించి రికార్డు సాధించారు. కాకినాడ నగరంలో టూటౌన్ పోలీస్‌స్టేషన్ సెంటర్ నుంచి ఎల్‌ఐసీ భవనం వరకు కిలోమీటరు మేరకు ఏడువేల మందితో శనివారం నిర్వహించిన మెగా యోగా కార్యక్రమం విజయవంతమైంది. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ అంత ర్జాతీయ యోగా దినోత్స వాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాలను జిల్లాలో గత నెల 21 నుంచి ఈనెల 21 వరకు నిర్వహించేందుకు ప్రణాళిక ప్రకారం పనిచేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సూచించిన మార్గ దర్శకాల ప్రకారం జిల్లాలో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల ఉపాధ్యాయులతో భారీ స్థాయిలో యోగా కార్యక్రమం చేశామన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ఏడువేలమంది హాజరయ్యారన్నారు. ఈ యోగా సాధన కేవలం అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజు వరకు మాత్రమే పరిమితం కాకుండా నిత్యజీవితాల్లో యోగాను ఒక భాగం చేసుకోవాలన్నారు. యోగా ను రోజూ సాధన చేయడం ద్వారా మానసిక ప్రశాంతత ఉంటుందన్నారు. వివిధ వృత్తుల్లో పనిచేస్తున్న వారు మరింత సమర్థతతో విధులు నిర్వహించే ందుకు యోగా దోహదపడుతుంద న్నారు. ఈనెల 21న జిల్లా, మండల, గ్రామ స్థాయిలో యోగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలను, ప్రజాప్రతినిధులను భాగస్వా మ్యం చేసుకుంటామ న్నారు. శనివారం జరిగిన యోగా కార్యక్రమం విజయవంతానికి సహకరించిన ప్రజాప్రతినిధులు, జిల్లా అధికార యంత్రాంగానికి ధన్యవాదాలు తెలిపారు.

యోగతో ఆరోగ్యం..

ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం మాట్లాడు తూ ప్రతిఒక్క పౌరుడికి ఆరోగ్యం చాలా అవసరమని, నిత్యం వివిధ రకాల మందులు వాడి ఆరోగ్యం పాడుచేసుకోకుండా యోగా సాధన చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకో వచ్చన్నారు. ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఆదేశాలతో జిల్లాలో యోగా కార్యక్రమాలు నిర్వహించడం శుభపరిణామమ న్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్రం అంతటా పండుగ వాతావరణంలో యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ప్రాచీన కాలం నుంచి భారతదేశంలో యోగాకు ప్రత్యేక స్థానం ఉంద న్నారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వన మాడి కొండబాబు మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని గ్రామస్థాయి వరకు తీసుకెళ్లే లక్ష్యంతోనే నెలరోజులపాటు నిర్వహించాలని సీఎం చంద్రబాబు కార్యాచరణ రూపొందించారన్నారు. సీఎం చంద్రబాబు 40 ఏళ్ల నుంచి యోగా సాధన చేయడం వల్లే ఇంకా ఎంతో ఆరోగ్యవంతంగా పని చేస్తున్నారన్నారు. యోగా శిక్షకుడు రామానంద అందరితో ఆసనాలు వేయించారు. అనంతరం యోగా శిక్షకులు రామా నందతోపాటు వేదికపై యోగాసనాలు వేసిన చిన్నారులను ముఖ్యఅతిథులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా, కాకినాడ కమిషనర్ భావన, అడిషనల్ ఎస్పీ మనీష్ పాటిల్ దేవరాజ్, కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, పాడా పీడీ చైత్రవర్షిణి, కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, ఉపాధ్యాయులు, అధికారులు, యువత, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యాటకానికి వచ్చి.. ప్రమాదంలో చిక్కి..

- సీలేరు నదిలో నలుగురు యువకులను కాపాడిన పోలీసులు, జెన్‌కో ఉద్యోగులు
- మరో యువకుడి గల్లంతు



ప్రమాదం నుంచి బయపడిన యువకులు



గల్లంతైన అభిలాష్ (ఫైల్‌ఫొటో)



నదిలో చిక్కుకున్నవారిని తాళ్ల సాయంతో బయటకు తీసుకొస్తున్న దృశ్యం

మోతుగూడెం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పర్యా టక ప్రాంతాల సందర్శనకు వచ్చిన యువకులు ప్రమాదంలో చిక్కుకున్న సంఘటన అల్లూరి జిల్లా మోతుగూడెం పరిధిలోని ధారాలమ్మ పిక్నిక్ స్పాట్ వద్ద జరిగింది. వివరాల్లోకి వెళ్తే తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి గ్రామానికి చెందిన 20 మంది తాపీ పని చేసే వ్యక్తులు శనివారం ఉదయం చింతూరు మండలం మోతుగూడెం పర్యాటక ప్రాంతాల సందర్శనకు రెండు టాటా మ్యాజిక్ వాహనాలపై వచ్చారు. మోతుగూడెం ధారాలమ్మ పిక్నిక్ స్పాట్ వద్ద సీలేరు నదిలో నీటి ప్రవాహం తక్కువగా ఉండటంతో నది మధ్యలోకి ఐదుగురు యువకులు వెళ్లి స్నానానికి దిగారు. అదే సమయంలో పొల్లూరు జల విద్యుత్‌కేంద్రంలో జెన్‌కో ఉన్నతాధికారులు విద్యుదుత్పత్తిని ప్రారంభించటంతో ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరిగిపోయింది. దీంతో యువకులు రాళ్లపైకి చేరి రక్షించడం అంటూ ఆర్తనాదాలు చేశారు. సమాచారం తెలుసుకున్న జెన్‌కో ఉన్నతాధికారులు ఒంటిగంట సమయంలో జనరేషన్ నిలిపివేశారు. ఎస్‌ఐ ఎస్‌కే సాధిక్, ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు, గజ ఈతగాళ్లు ఘటన స్థలానికి చేరుకున్నారు. పోలీసులు, జెన్‌కో ఉద్యోగులు, గుత్తేదారు కార్మికులు, స్థానిక యువకులు నది ప్రవాహం మధ్యలో చిక్కుకుపోయిన పి.సుధీర్, కె.నాగేంద్ర, సి.రామకృష్ణ, బి.ప్రభులను తాళ్ల సాయంతో సురక్షితంగా ఒడ్డుకు తీసుకు వచ్చి కాపాడారు. అభిలాష్ (18) అనే యువకుడు గల్లంతయ్యాడు. ఆ యువకుడి కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు.

ఊడిన టైరు.. అదుపుతప్పిన లారీ



ఊడిపోయిన లారీ టైరు

శంఖవరం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రౌతులపూడి నుంచి శంఖవరం మీదుగా రావికంపాడు వెళ్తున్న లారీ టైరు ఊడిపోవడంతో అదుపుతప్పి గోడను ఢీకొంది. లారీ లోడుతో రోడ్డుకు అడ్డుగా ఉండిపోవడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. పోలీసులు రౌతులపూడి వెళ్లే వాహనాలను గౌరంపేట మీదుగా మళ్లించారు. సంఘటనా స్థలాన్ని స్థానిక టీడీపీ సీనియర్ నేత పర్వత సురేష్ పరిశీలించి వందలాదిగా గ్రామాల్లో లారీలు తిరగకుండా చర్యలు చేపట్టాలని, విద్యార్థులు రాకపోకలు సాగించే సమయంలో రాకపోకలు నిలిపివేయాలని పోలీసులను కోరారు.

లారీ బోల్తా

ఏలేశ్వరం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరం పరిధి చిన్నింపేటలో శనివారం లారీ బోల్తా పడింది. జాతీయ రహదారిపై పంటపొలాల్లోకి వెళ్లిపోయింది. అయితే ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. విశాఖపట్నం పోర్టు నుంచి జిప్సం లోడును కర్ణాటకకు ఈ లారీ తీసుకెళ్తోంది. దీనిపై పోలీసులకు ఎటువంటి సమాచారం అందలేదు.



వంద కిలోల గంజాయితో ఇద్దరి అరెస్ట్



పట్టుబడిన గంజాయి, నిందితులతో చింతూరు పోలీసులు

చింతూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఒడిస్సా నుంచి వయా చింతూరు మీదుగా వంద కిలోల గంజాయి తరలిస్తూ శనివారం ఇద్దరు నిందితులు పోలీసులకు పట్టుబడ్డారు. చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా కథనం మేరకు.. చింతూరు మండలం మోతుగూడెం పోలీసుస్టేషను పరిధిలోని తూలుగొండకు చెందిన కరణం రామాంజనేయులు, ఆరెళ్ళ బొజ్జి ఒడిస్సాలోని కొవ్వాసి తాతారావు వద్ద వంద కిలోల గంజాయి కొనుగోలు చేశారు. ఈ క్రమంలో వయా చింతూరు మీదుగా కారులో తెలంగాణ రాష్ట్రం ఖమ్మంలోని షేక్ సుభానికి గంజాయి చేరవేసేయత్నంలో పట్టుబడ్డారు. వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఏఎస్పీ తెలిపారు. కరణం రామాంజనేయులు, కొవ్వాసి తాతారావు, షేక్ సుభానీపై చింతూరు, డొంకరాయి పోలీసు స్టేషన్లలో ఇప్పటికే గంజాయి తరలింపు కేసులు ఉన్నాయని, వీరంతా గ్యాంగ్‌గా ఏర్పడి గంజాయి రవాణాకు పాల్పడుతున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ తెల్లం దుర్గాప్రసాద్, చింతూరు ఎస్‌ఐ పి.రమేష్, మోతుగూడెం ఎస్‌ఐ షేక్ సాధిక్ సిబ్బంది పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



మరణించిన సాయి (ఫైల్)

తుని రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన కాకి నాడ జిల్లా తుని రైల్వేస్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. నర్సీపట్నం రోడ్డు- గుల్లిపాడు రైల్వేస్టేషన్ మధ్యలో వ్యక్తి పట్టాలు దాటుతుండగా రాజమండ్రి వైపు వెళ్తున్న రైలు ఢీకొని సుమారు 35 ఏళ్ల వ్యక్తి మృతిచెందాడని తుని రైల్వే పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ జి.మోహన్‌రావు తెలిపారు. మృతుడు అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం న్యాయపూడి గ్రామానికి చెందిన సాయి అని తెలిపారు. మృతుడికి తల్లి, తండ్రి భార్య ఉన్నారు. అతడికి ఆరునెలల క్రితమే వివాహమైందని బంధువుల ద్వారా తెలిసిందన్నారు. శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని మృతుడి సంబంధీకులకు అప్పగించినట్టు పేర్కొన్నారు.

సత్యదేవుడికి వేడుకగా ప్రాకారసేవ



ప్రాకారసేవలో పాల్గొన్న భక్తులు

అన్నవరం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి శనివారం ప్రాకారసేవ వేడుకగా జరిగింది. ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్లను తిరుచ్చివాహనంపై ఆశీనులు గావించి తూర్పురాజగోపురం వద్దకు తోడ్కొనివచ్చారు. భక్తుల గోవిందనామస్మరణలు పండితుల వేదమంత్రోచ్చరణల నడుమ ముమ్మారు ప్రదక్షిణ గావించారు. పండితుల మహదాశీర్వచనం అనంతరం తిరిగి ప్రధానాలయానికి స్వామి, అమ్మవార్లను తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఈవో వీర్ల సుబ్బారావు తదితరులున్నారు.

రూ.లక్ష విరాళం

అన్నవరం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి శనివారం గుంటూరుకు చెందిన తోట రిషితశ్రీ 1,00,011 విరాళాన్ని ఆలయ పీఆర్వో కృష్ణారావుకు అందజేశారు. దాతను ఆయన అభినందించి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు.



పీఆర్వోకు విరాళం అందజేస్తున్న దాత

పేదలపై ఫీజులుం..

- పేద విద్యార్థులతో ప్రైవేటు స్కూల్స్ ఆటలు
- పలు యాజమాన్యాల అతి తెలివి
- అదనపు ఫీజులతో తల్లిదండ్రులు బెంబేలు
- ఒకటో తరగతి సీటని.. యూకేజీ అడ్మిషన్

రాజమండ్రికి చెందిన ఓ మెకానిక్ తన కొడుకును 1వ తరగతిలో చేర్పించడానికి ఆర్టీఈ చట్టం 12 (1)సీ ప్రకారం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నాడు. తమ స్కూల్‌లో సీటు కేటాయింపు జరిగిందని, స్వయంగా వచ్చి మిగతా ప్రక్రియ పూర్తి చేయాలంటూ ఓ కార్పొరేటు/ప్రైవేటు స్కూల్ నుంచి ఆయనకు ఎస్ఎంఎస్ వచ్చింది. పిల్లాడిని తీసు కుని ఆ స్కూల్‌కి వెళ్లాడు. అక్కడ విద్యార్థి చదువు, సామర్థ్యాన్ని పరీక్షించారు. అయితే ఆ పిల్లాడి లెవెల్స్ తమ స్కూలు స్టాండర్డుకు సరిపోదని చెప్పగా ఆ పేద తల్లిదండ్రులు కంగుతిన్నారు. వాళ్లు తేరు కోకముందే.. 'మీ పిల్లాడిని ఇక్కడే ఈ ఏడాది యూ కేజీలో జాయిన్ చేయండి. ఫీజు రూ.45వేలు' అని సెలవిచ్చారు. తమ కొడుకు పట్ల శ్రద్ధ వహిస్తామని ఆ తల్లిదండ్రులు ప్రాథేయపడగా సరే అన్నారు.



(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ప్రైవేటు స్కూల్స్ వ్యాపార యావ.. చదువుకునే హక్కును కూడా చదువుకునేవిధంగా మార్చేస్తోంది. విద్యా హక్కు చట్టాన్ని(ఆర్టీఈ) అపహాస్యం చేస్తోంది. సామాజిక బాధ్యత మాట అటుంచితే ఆయా పాఠశాలల యాజమాన్యాల తెలివి తేటలకు పేద పిల్లల తల్లిదండ్రులు కళ్లు తేలేస్తున్నారు. ఇప్పటికే ఫీజుల మోత మోగిస్తున్న ప్రైవేటు పాఠశాలలు.. పేద విద్యార్థుల నుంచి కూడా ఏదో రకంగా దండుకోవాలని చూస్తున్నాయి. అన్నీ కాకపోయినా అధిక శాతం ప్రైవేటు పాఠశాలలు విద్యార్థుల పేదరికంతో ఆడుకుంటున్నాయి. తమ పిల్లాడికి కార్పొరేట్ స్కూల్లో ఉచితంగా సీటు లభించిందని ఆనందిస్తున్న తల్లిదండ్రులకు తీరా స్కూల్‌లో అడుగుపెట్టాక సొమ్ముల లెక్కలతో చుక్కలు చూపిస్తున్నారు. ఆవేదనను ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆ నిరుపేద తల్లిదండ్రులు కన్నీటిని ఆశ్రయిస్తున్నారు. ఫీజు సంగతి ఎలా ఉన్నా.. అదనపు డబ్బులు చెల్లిం చుకోడానికి అప్పుల కోసం తిప్పలు తప్పడం లేదు.

తడిసి మోపెడు

విద్యా హక్కు చట్టప్రకారం ప్రతి కార్పొరేట్ స్కూల్‌లో ప్రతి ఏడాది ఒకటో తరగతిలో 25శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయించాలి. అమ్మ ఒడి/తల్లికి వందనం వంటి పథకాల ద్వారా ప్రభు త్వం విద్యార్థుల తల్లికి ఇచ్చే డబ్బులను ఆ స్కూల్‌కి ఫీజు కింద చెల్లిస్తారు. ఈ విధంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో వందల సంఖ్యలో సీట్లు ఉన్నాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే ఆరు దశల ప్రక్రియ అనంతరం విద్యార్థి కోరుకున్న, ఇంటికి కాస్త దగ్గరగా ఉన్న స్కూ లును కేటాయిస్తారు. ఇదంతా ఆన్‌లైన్ ద్వారా జరుగుతుంది. కేటాయింపు మెసేజ్ సదరు విద్యార్థి పేరెంట్స్‌కి వెళుతుంది. తర్వాత స్కూల్‌కి వెళ్లి తదుపరి ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది. అయితే ఇక్కడే కొన్ని పాఠశాలలు ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. బస్సు, యూనిఫాం, షూ, టై, ఆ రుసుము, ఈ ఫండు అంటూ తడిసి మోపెడు ఫీజును తల్లిదండ్రుల నెత్తి మీద పెడుతున్నారు. దీంతో ఆ పేద తల్లిదండ్రులకు ఏమీ పాలుపోని పరిస్థితి ఎదురవుతోంది. ఆ మాత్రం డబ్బులు కట్టలేని వాళ్ళకు కార్పొరేట్ చదువు ఎందుకంటూ చులకన మాటలను కూడా తల్లిదండ్రులు ఎదుర్కోవాల్సి వస్తోంది.



ఇదో రకం సమస్య

గతంలో నేరుగా ఒకటో తరగతిలో చేర్చేవారు. తర్వాత ఎల్‌కేజీ, యూకేజీలు వచ్చి చేరాయి. ఆ కేజీలు అన్ని చోట్లా ఒకే విధంగా ఉండవు. కాస్త చిన్న కాన్వెంట్లలో తక్కువస్థాయిలో చదువు ఉంటుందన్న విషయం తెలిసిందే. పలువురు తల్లిదండ్రులు చిన్న పిల్లలు కదా.. అప్పుడే చదువు పేరుతో రుద్దడం ఎందుకని ఆలోచించడం వల్ల కూడా ఏబీసీడీల్లో సైతం వెనుకబడుతున్నారు. దీంతో కార్పొరేట్ స్కూల్‌లో ఒకటో తరగతిలో చేర్చే సమయం వచ్చినపుడు ఈ పిల్లాడి స్థాయి కార్పొరేట్ చదువును అందుకోలేకపోతోంది. తరగతిలో పిల్లలందరిదీ ఒకరకం స్థాయి ఉంటే ఈ పిల్లలకు తక్కువ చదువు ఉంటోంది. దీంతో స్కూల్ యాజమాన్యాలు కూడా చేర్పించుకోవడానికి వెనుకడుగు వేస్తున్నాయి. తమ పిల్లలకు సరిగా చదువు చెప్పడం లేదనే మాట భవిష్యత్తులో తల్లిదండ్రుల నుంచి పడాల్సి వస్తుందని భయపడుతున్నాయి. చదువులో వెనుకబడిన వారిని తీర్చిదిద్దడమే అసలైన విద్యా నేర్పరితనం అనే వాదన వినవస్తోంది.



ఇబ్బంది ఉంటే చెప్పండి

ఆర్టీఈ చట్ట ప్రకారం పేద విద్యార్థులకు కేటాయించిన సీట్లలో కచ్చితంగా చేర్పించుకోవాలి. ఏదైనా సమస్య ఉంటే విద్యాధికారుల దృష్టికి తీసుకు రావాలి. అలాగే విద్యార్థుల చదువుపై తల్లిదం డ్రులకు కూడా శ్రద్ధ వహించే బాధ్యత ఉంటుంది. కాస్త పికప్ అయ్యే వరకూ ట్యూషన్ పెట్టించడం, ఇంట్లో పట్టించుకోవడం వంటివి చేస్తే మంచిది. ఇబ్బంది పెడుతున్నారని మాకు ఫిర్యాదులు రాలేదు. ఒకవేళ వస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

కె.వాసుదేవరావు, జిల్లా పాఠశాల విద్యాధికారి, తూర్పు గోదావరి

---

10 నుంచి నైపుణ్యాభివృద్ధి శిక్షణా తరగతులు

9వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి : వికాస ప్రాజెక్టు డైరెక్టర్ లచ్చారావు

కాకినాడ సిటీ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం వాకలపూడిలోని డీడీయుజీకెవై సెంటర్‌లో ఈ నెల 10వ తేదీ మంగళవారం నుంచి వికాస ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణా తరగతులు ప్రారంభంకానున్నాయని వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఈ శిక్షణకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో ఉత్తీర్ణులైన 18 నుంచి 30 సంవత్సరాలలోపు పురుష అభ్యర్థులు అర్హులన్నారు. టూ వీలర్ టెక్నీషియన్, వేర్ హౌస్ ఎగ్జిక్యూటివ్ కోర్సులలో 3 నెలల శిక్షణ ఇచ్చి ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. శిక్షణ అనంతరం సెంట్రల్ గవర్నమెంట్ ద్వారా సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి, యూనిఫామ్, స్టడీ మెటీరియల్ అందిస్తామన్నారు. ఈ కోర్సులతో పాటు అదనంగా బేసిక్ కంప్యూటర్ కోర్సు, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 9వ తేదీ సోమవారం లోపు సెల్ నంబర్లు 8328483297, 89784 75164లలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పీడీ తెలిపారు.

కొనసాగుతున్న వాకతిప్ప చోరీ కేసు దర్యాప్తు

కొత్తపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం వాకతిప్పలో ఇటీవల జరిగిన బంగారు ఆభరణాల చోరీ కేసు దర్యాప్తు కొనసాగుతోంది. వాకతిప్పకు చెందిన పేరూరి శ్రీనివాసరావు మాస్టారి ఇంట్లో ఎవరూ లేని సమయంలో తలుపులను మారుతాళాలతో తెరచి సుమారు 12 తులాల బంగారు ఆభరణాలు, రూ.1.20లక్షల నగదు చోరీకి గురైన విషయం విదితమే. ఇంట్లో సీసీ కెమెరా పుటేజీలో ఇద్దరు వ్యక్తులు తలుపులు బద్దలుకొట్టి లోపలకు ప్రవేశించారనే విషయం రికార్డు కావడంతో ఆయా పుటేజీల ఆధారంతో నిందితులు ఎవరనే విషయాన్ని గుర్తించేందుకు గాలింపు చర్యలు చేపడుతున్నామని కొత్తపల్లి ఎస్‌ఐ జి.వెంకటేష్ చెప్పారు. నాలుగైదు రోజుల్లో కేసు కొలిక్కి రావచ్చునని ఎస్‌ఐ అభిప్రాయం వ్యక్తం చేశారు.

వ్యక్తిపై దౌర్జన్యం

కేసు నమోదు

కొవ్వూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ మాట్లాడుకుంటున్న వ్యక్తిపై దౌర్జన్యం చేసి కొట్టి గాయపర్చిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ హెచ్‌సీ లలితకుమారి తెలిపారు. వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రాజేంద్రనగర్‌కు చెందిన కొండాక తరుణ్ టాటాక్యాపిటల్ మైక్రో ఫైనాన్స్‌లో పనిచేస్తున్నాడు. ఈనెల 6వ తేదీన కొవ్వూరు మండలం వాడపల్లి వచ్చి గెల్లా లక్ష్మీ అనే ఆమె వద్ద ఈఎంఐ కట్టించుకుని వెళ్తూ పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో నిలబడి ఫోన్ మా ట్లాడుతున్నాడు. ఇంతలో స్థలం యజమాని గెల్లా సతీష్ నా స్థలంలోకి ఎందుకు వచ్చావు అంటూ దౌర్జన్యం చేసి దుర్భాషలాడుతూ సెల్‌ఫోన్ లాక్కొని తలపై కొట్టి గాయపర్చాడు. స్థానికులు గాయపడిన తరుణ్‌ని చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వచ్చిన సమాచారం మేరకు తరుణ్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ లలితకుమారి పేర్కొన్నారు.

కత్తితో దాడి చేసిన వ్యక్తిపై కేసు

కొవ్వూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిని కత్తితో దాడి చేసి గాయపర్చిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామానికి చెందిన పోతుల వెంకటేష్ శనివారం రాత్రి తన కొడుకుని కొడుతున్నాడు. పక్కఇంటిలో ఉంటున్న మల్లిన సతీష్ ఎందుకు పిల్లాడిని అలా కొడుతున్నావని అడిగాడు. దీంతో వెంకటేష్ కత్తి తీసుకువచ్చి నా కొడుకుని కొడుతుంటే నీకెందుకు అంటూ చెవిపై గాయపర్చాడు. గాయమైన సతీష్‌ని చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి సమాచారం మేరకు సతీష్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన్టు సీఐ పి.విశ్వం పేర్కొన్నారు.

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

'పోక్సో'పై అవగాహన కల్పించండి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

» మిషన్ వాత్సల్యపై సమీక్షలో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ప్రతి చిన్నారి హక్కులు సురక్షితంగా ఉండే విధంగా, వారి శ్రేయస్సు కోసం సమర్థవంతంగా సేవలు అందించడానికి, వారిపై జరిగే దాడులు అరికట్టే దిశగా, పోక్సో కేసుల గురించి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. మిషన్ వాత్సల్యపై ఆమె శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికలు, యువతులపై జరుగుతున్న అమానుష ఘటనలను సమాజం తీవ్రంగా ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. మిషన్ వాత్సల్యపై ప్రజల్లో విస్తృతంగా చర్చ జరగాలన్నారు. బాల్య వివాహాలు చేసుకున్న వారు, వాటిని ప్రోత్సహించిన వాళ్లపై పోక్సో చట్ట ప్రకారం కేసులు నమోదు చేయాలన్నారు. 18ఏళ్లలోపు వారు గర్భం దాల్చి ఆస్పత్రులకు వస్తే వారితోపాటు తల్లిదండ్రులకు కూడా కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. జువైనల్ జస్టిస్ చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఇకపై జరిగే సమావేశాలకు జువైనల్ అధికారి తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. పిల్లల రక్షణకు సంబంధించి త్వరగా చర్యలు తీసుకోవాలని, ప్రతి మూడు నెలలకు ఒకసారి చట్టం అమలు జరుగుతున్న తీరుపై ఆర్డీవోలు సమావేశాలు నిర్వహించాని ఆమె ఆదేశించారు. పిల్లలకు ఉన్న రక్షణ చట్టాలను ఉల్లంఘిస్తే ఎదుర్కోవాల్సిన పర్యవసానాలపై హోర్డింగులు, ఫెక్సీల ద్వారా ప్రచారం కల్పించాలన్నారు. ఎస్పీ నరసింహ కిషోర్ మాట్లాడుతూ చిన్నారుల విషయంలో వచ్చే ఫిర్యాదులపై సత్వరమే స్పందిస్తున్నామన్నారు. అలాగే ఇతర సంబంధిత విభాగాలు కూడా తగిన సమయంలో చర్యలు తీసుకోవాలని చెప్పారు. బాల్య వివాహాలు, బాల కార్మికులు, అనాథలు, తప్పిపోయిన పిల్లలు వంటి సమస్యలపై చట్ట పరమైన చొరవ అవసరమన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ఇన్చార్జి పీడీ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య
ఆవిర్భావ దినోత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య 42వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సమాఖ్య అధ్యక్షుడు కోనూరు సతీష్‌శర్మ ఆదేశాల మేరకు స్థానిక కోటిపల్లి బస్టాండ్ వద్ద ప్రాంతీయ కార్యాలయంలో శనివారం నగర అధ్యక్షుడు పుట్రేవు సూర్యవెంకటరావు సమాఖ్య పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాఖ్య తరపున మరిన్ని మంచి కార్యక్రమాలను చేపట్టి సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కల్లూరి సోమయాజులు, కె.భాస్కరరామ్, బి.వెంకటరమణమూర్తి, కె.సూర్యకుమారి, పుట్రేవు ఉపేంద్రకుమార్ పాల్గొన్నారు.

వాహనదారులకు అసౌకర్యం కలిగిస్తే సహించం

అనపర్తి మెయిన్‌రోడ్డులో తోపుడు బండ్లను తొలగించిన పోలీసులు

అనపర్తి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): వాహనదారులకు అసౌకర్యం కలిగిస్తే సహించబోమని సీఐ సుమంత్ అన్నారు. అనపర్తిలోని మెయిన్ రోడ్డులో పార్కింగ్ స్థలంలో ఏర్పాటు చేసిన తోపుడు బండ్లను, దుకాణాలను పోలీసులు శనివారం తొలగించారు. మెయిన్‌రోడ్డులో షాపులకు వచ్చే వినియోగదారులకు మోటారుసైకిళ్ల పార్కింగ్ చేసుకునేందుకు వీల్లేకుండా చిరు వ్యాపారులు పరిమినెంట్ దుకాణాలు ఏర్పాటు చేయడంతో తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రెండు రోజుల నుంచే హెచ్చరిస్తున్నా పరిస్థితిలో మార్పు రాలేదు. దీంతో శనివారం పోలీసులు దేవీచౌక్ నుంచి రైల్వే స్టేషన్ వరకు ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మెయిన్‌రోడ్డులో తోపుడు బండ్లతో బాటు దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని వస్తున్న ఫిర్యాదుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనునాయక్, ఏఎస్ఐ దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

బాలిక కుటుంబానికి ఎమ్మెల్యే గోరంట్ల పరామర్శ


బాలిక కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

ఆర్థిక సాయం అందజేత

ధవళేశ్వరం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): చెట్టు కొమ్మ విరిగిపడి మృతి చెందిన బాలిక పాతూరి అక్షర(9) కుటుంబాన్ని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి శనివారం పరామర్శించారు. బాలిక తండ్రి త్రిమూర్తులును, కుటుంబ సభ్యులను ఓదార్చారు. తన స్వీయ నిధులు రూ.25 వేలు కుటుంబానికి అందజేస్తూ అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరుపున రావాల్సిన అన్ని ప్రయోజనాలు అందే విధంగా సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళతామన్నారు. ఇదే ఘటనలో గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మరో చిన్నారి దేవదాసి లిఖిత ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ప్రమాదానికి కారణమైన రావిచెట్టును పరిశీలించారు. కొమ్మలు తొలగించి చెట్టును ట్రిమ్ చేయించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, మచ్చేటి ప్రసాద్, పండూరి అప్పారావు, ఆళ్ల ఆనందరావు, పుక్కెళ్ల రాజు, బొబ్బిలి రామకృష్ణ, నాళ్ల రమేష్, అంబటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్ చెస్ ఫిడే రేటింగ్స్‌లో వర్ణిక ప్రతిభ



రాజమహేంద్రవరం రూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరానికి చెందిన గంధం త్విషా వర్ణిక ఇంటర్‌నేషనల్ చెస్ ఫిడే రేటింగ్స్‌లో ప్రతిభ కనబరిచి 1611 క్లాసికల్ రేటింగ్ పాయింట్ సాధించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో పలు చోట్ల నిర్వహించిన అండర్-11, ఓపెన్ క్యాటగిరీలలో జరిగిన చదరంగం పోటీల్లో పాల్గొని పలు బహుమతులు సాధించినట్టు కోనిగ్ చెస్ నిర్వాహకుడు కేఎల్ రాజు తెలిపారు. కాగా వర్ణిక తల్లి సునీత సీతానగరం డిప్యూటీ తహశీల్దార్‌గాను, తండ్రి శ్యాంబాబు ఐజీపీఎల్ గ్రూప్ ఆఫ్ కంపెనీ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. జూన్ 1న నిర్వహించిన పోటీల్లో ఇంటర్‌నేషనల్ చెస్ ఫెడరేషన్ ద్వారా వర్ణిక తొలి రేటింగ్ సాధించి పలు మన్ననలు అందుకుంది. గ్రాండ్‌మాస్టర్ కావడమే తన లక్ష్యమని చెబుతున్న ఈ చిన్నారిని జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి జీవీ కుమార్ తదితరులు అభినందించారు.

గోగులమ్మ తిరునాళ్లు



రాజానగరం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): రాజానగరంలో మూడేళ్ల కోసారి జరిగే శ్రీగోగులమ్మ తిరునాళ్ల, వీరభద్ర స్వామి సంబరాలు శనివారం ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా తొలి రోజు జాగరణ సందర్భంగా గరగ, ఆశాదుల, కాళికా, కేరళ, రాధాగోపాలం నృత్య ప్రదర్శనలతో భారీ ఊరేగింపు చేపట్టారు. తొలుత అమ్మవారికి వేకువ జాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రెండో రోజు ఆదివారం శ్రీవీరభద్ర శూలాల సంబరం, కోలాటం, కూచిపూడి నృత్య ప్రదర్శన, అగ్ని గుండం కార్యక్రమాలు బాణసంచా కాల్పుల నడుమ జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది.

త్యాగానికి ప్రతీక బక్రీద్

బిక్కవోలు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): త్యాగానికి ప్రతీకగా భావించే బక్రీద్ పండుగను మండలంలోని ముస్లింలు శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పందలపాకలోని అహలే సున్నత్ వల్ జమాత్ జామియా మసీదులో గురువు షేక్ గులాంగౌసేరిజ్వి ఆధ్వర్యంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో బాషామాస్టర్, మొహ్మద్‌పీర్, మదీనా, వల్లీషాలతో పాటు తొస్సిపూడి, కొంకుదురు, కొమరిపాలెం గ్రామాల్లోని ముస్లింలు పాల్గొన్నారు. అలాగే బిక్కవోలు, బలభద్రపురం గ్రామాల్లోని మసీద్‌లలో ముస్లింలు బక్రీద్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

గోకవరం: గోకవరంలో ముస్లింలు బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యుత్ కార్యాలయం సమీపంలోని జామియా మసీద్, పాతబస్టాండ్ వద్ద ఉన్న జుమ్మా మసీద్‌లో ప్రత్యేక నమాజ్‌లు నిర్వహించారు. మతగురువులు ఖురాన్ ప్రాముఖ్యతను వివరించారు.


పందలపాకలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం

అనపర్తి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పొలమూరులోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో శనివారం స్వామి వారి కల్యాణం జరిగింది. గ్రామానికి చెందిన మానేపల్లి వీరబ్రహ్మం ఝాన్సీలక్ష్మి దంపతులతో పండితులు కల్యాణం నిర్వహింపజేశారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వేణుగోపాలుడి కల్యాణం

సీతానగరం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): సీతానగరంలో విష్ణాలయంలో శ్రీ వేణుగోపాల స్వామి వార్షిక తిరు కల్యాణం శుక్రవారం రాత్రి వైభవంగా జరిగింది. ఆలయార్చకులు రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి కల్యాణ్యాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. దేవదాయ ధర్మదాయ శాఖ ఈవో పాటి సత్యనారాయణ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

పుట్టగొడుగుల్లా..
అక్రమ లేఅవుట్లు


గోకవరంలో వేసిన అక్రమ లేఅవుట్

కనీస అనుమతులు ఉండవు
ప్రభుత్వ నిబంధనలు పాటించరు
గోకవరంలో ఇష్టానుసారంగా వెంచర్లు

గోకవరం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): గోకవరం మండలంలో అక్రమ లేఅవుట్ల దందా నడుస్తోంది. కనీస అనుమతులు పొందకుండా, ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా లేఅవుట్లు వేసి ప్లాట్ల అమ్మకాలు సాగిస్తున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులే నోరు మెదపక పోవడంతో అక్రమ వెంచర్ల దందా జోరుగా సాగుతోంది. అనుమతులు లేని లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు గృహాలు నిర్మించుకునే సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూములుగా మారాలంటే మార్కెట్ విలువకు తగ్గట్టుగా ప్రభుత్వానికి రుసుము చెల్లించాలి. ఆ రసీదుతో రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకుంటే అనుమతులు వస్తాయి. ఇవేవీ పాటించకుండా అక్రమార్కులు క్రయవిక్రయాలు నిర్వహిస్తున్నారు.


కొత్తపల్లిలో వేసిన అక్రమ లేఅవుటు

నిబంధనలకు తూట్లు..

లేఅవుట్లు వేస్తున్న వ్యాపారులు నిబంధనలు పాటించడం లేదు. భూమిని లేఅవుట్లుగా మార్పు చేసినట్టు రెవెన్యూ అధికారుల నుంచి అనుమతి పొందాలి, ఆ తర్వాత పంచాయతీ అనుమతి పొందాలి. లేఅవుట్లలో రహదారులు, డీటీసీపీ అనుమతి, విద్యుత్ సౌకర్యం, తాగునీరు, మౌలిక వసతుల కోసం కొంత మేర స్థలం కేటాయించాల్సి ఉంది. ఇవేమీ లేకుండానే పనులు కానిస్తున్నారు. రూ.లక్షలతో వ్యవసాయ భూములను కొనుగోలు చేసి అనుమతులు లేకుండా లేఅవుట్లు వేసి రూ.కోట్ల విలువ చేసే భూమిగా మారుస్తున్నారు. భూమిని కొనుగోలు చేసిన వెంటనే ప్రైవేట్ సర్వేయర్లతో కుమ్మక్కై భూములను లే అవుట్లుగా మారుస్తున్నారు. వాటిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో అనుమతులులేని లేఅవుట్లను పంచాయతీ అధికారులు గుర్తించి వాటిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే రెండు, మూడు రోజుల్లో ఆ బోర్డులు కనిపించకుండాపోయాయి. గోకవరంలో అధికారికంగా 8 లేఅవుట్లు ఉండగా, అనధికారికంగా 9, కొత్తపల్లిలో సుమారు మూడు అనధికార లేఅవుట్లు ఉన్నట్టు సమాచారం.

త్వరలో జిల్లాలో 3 ప్రాజెక్టులకు శ్రీకారం

మంత్రి కందుల దుర్గేష్


పుష్కరఘాట్ వద్ద పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో త్వరలోనే మూడు ప్రధాన ప్రాజెక్టులకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్,ఎంపీ పురందేశ్వరి శంకుస్థాపన చేస్తారని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఈ మేరకు రాజమహేంద్రవరంలోని అఖండ గోదావరి ప్రాజెక్టు, రాజానగరంలో అటవీ అకాడమీ, బొమ్మూరులో సైన్సు మ్యూజియం ప్రారంభోత్సవాలపై వివిధ శాఖల అధికారులతో ఆయన శనివారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పష్టమైన కార్యాచరణతో ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. తొలుత అఖండ గోదావరి శంకుస్థాపన జూన్ 19న నిర్వహించడానికి ఆలోచన చేశామని, అయితే రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం ఉండడంతో ఆ తేదీని త్వరలోనే ప్రకటిస్తామన్నారు. అనంతరం అధికారులతో కలిసి సభా వేదిక, బహిరంగ సభ ప్రాంతం తదితర ఏర్పాట్లను ఆయన శనివారం పరిశీలించారు. చారిత్రక, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే విధంగా అఖండ గోదావరి ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రాలకు పెట్టుబడుల కింద కేంద్ర ప్రభుత్వం అందించే ప్రత్యేక ఆర్థిక సహాయం నిధులు రూ.97 కోట్లు ఈ ప్రాజెక్టుకు మంజూరయ్యాయన్నారు. వీటితో రాజమహేంద్రవరం, ధవళేశ్వరం, కడియం, కొవ్వూరు, నిడదవోలుతోపాటు పలు ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధి పనులు చేపడతామన్నారు. 2027లో జరిగే గోదావరి పుష్కరాల నాటికి వాటిని పూర్తి చేస్తామని చెప్పారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ 127ఏళ్ల చరిత్ర కలిగి వారసత్వ సంపదకు ప్రతీకగా నిలిచిన హేవలాక్ బ్రిడ్జిని ఆధునికీకరిస్తామన్నారు. వంతెన ప్రాంతంలో జలపాతాలు, గ్రాస్ వంతెనలు, గేమింగ్ జోన్, స్పేస్ థీమ్, అర్బన్ హ్యాండీ క్రాఫ్ట్ బజార్, హ్యాంగింగ్ గార్డెన్స్, హోలోగ్రామ్ జూ, టైమ్ ట్రావెల్, రైల్ మ్యూజియం, అక్వేరియం టన్నెల్ వంటివి ఏర్పాటు చేస్తున్నామన్నారు. పుష్కర్‌ఘాట్‌ను కూడా మరింత అభివృద్ధి చేసే విధంగా ప్రణాళికలు రూపొందించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బత్తుల బలరామకృష్ణ, ఎస్పీ నరసింహ కిషోర్, మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్, జేసీ చిన్న రాముడు తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ అండ్ హెల్దీ సిటీగా రాజమహేంద్రి


దేవిచౌక్-పేపరుమిల్లు రోడ్డులో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే వాసు

» నగరంలో వేయి చెట్లు నాటి సంరక్షించుకుందాం
» ఎమ్మెల్యే ఆదిరెడ్డివాసు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): చెట్లను పెంచి నగరాన్ని గ్రీన్ అండ్ హెల్దీ సిటీగా మార్చేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. గ్రీన్ రాజమండ్రి ఆరోగ్య రాజమండ్రి కార్యక్రమంలో భాగంగా రాజమహేంద్రవరంలోని దేవిచౌక్ నుంచి పేపరుమిల్లుకు వెళ్లే ప్రధాన రహదారిలో శనివారం జనసేన కార్పొరేషన్ అధ్యక్షుడు వైశ్రీ నుతో కలిసి మాటూరి సిద్దు సారథ్యంలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో దశల వారీగా వేయి చెట్లు నాటి వాటిని సంరక్షించి పెంచుదామన్నారు. వేగంగా పెరిగే చెట్లను ఎంపిక చేసి నాటుతున్నామన్నారు. జనసంచారం అధికంగా వుండే చోట్ల చెట్లు నాటడం వల్ల భవిష్యత్‌లో నీడనివ్వడంతో పాటు ఆక్సిజన్‌ను విడుదల చేస్తాయని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, వర్రే శ్రీనివాసరావు, మజ్జి రాంబాబు, రెడ్డి మణేశ్వరరావు, బుడ్డిగ రాధా, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మొక్కలను నాటి సంరక్షించాలి


అనపర్తిలో మొక్కను నాటుతున్న సుధాకరరెడ్డి

అనపర్తి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): అనపర్తి సావరంలోని సచివాలయం-5 ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ తమలంపూడి సుధాకరరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు మానవాళికి జీవనాధారమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటి సంరక్షణ బాధ్యతలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీసీ ఉపాధ్యక్షుడు కర్రి వెంకటరెడ్డి, నాయకులు నరేంద్ర చౌదరి, ముత్యాలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణాల్లో సర్వే ఆపాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఉమామహేశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావొస్తున్న నేపథ్యంలో పట్టణ ప్రజలపై ఆస్తిపన్ను పెంపుతో పాటు కరెంట్ చార్జీల బాదుడు ప్రజలకు వార్షికోత్సవ కానుకగా అందించారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఉమా మహేశ్వరరావు విమర్శించారు. శనివారం రాజమహేంద్రవరం ఇన్నీసుపేటలోని అల్యూమినియం హాలులో సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జువ్వల రాంబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని పట్టణ ప్రజలపై 20 శాతం ఇంటిపన్ను బాదుడు లక్ష్యంగా అధికారులు సర్వే చేస్తున్నారన్నారు. రాజమహేంద్రవరం ప్రజలపైనా ఈ భారాలు తప్పవన్నారు. తక్షణమే ఈ సర్వే ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజాసమస్యలపై నిర్వహించిన ప్రజా రక్షణభేరిలో అనేక సమస్యలు వచ్చాయని, వాటిపై భవిష్యత్ పోరాటాలు సాగిస్తామన్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పి.పవన్, పి.తులసి, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'కాపు భవనానికి స్థలం'పై హర్షం

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కాపుల చిరకాల స్వప్నంగా ఉన్న కాపు భవనానికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే స్థలం కేటాయించిందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యర్రా వేణుగోపాలరాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఆయన రాజమహేంద్రవరంలో ఒక ప్రకటన విడుదల చేశారు. కాపు భవనం కోసం చొరవ తీసుకున్న మంత్రి కందుల దుర్గేష్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. బొమ్మూరులో 30 సెంట్ల స్థలాన్ని కేటాయించడం తమ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని వేణు పేర్కొన్నారు.

పూజ దీపం చీరకు అంటుకుని..
వృద్ధురాలి మృతి

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పూజ చేస్తుండగా దీపం చీరకు అంటుకుని ఓ వృద్ధురాలు మృతి చెందింది. వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. రాజమహేంద్రవరం దానవాయిపేట చినగాంధీ బొమ్మ వీధికి చెందిన కటకం లక్ష్మి(72)కు భర్త లేడు. ఆమె కుమార్తె భర్త పిల్లలతో దానవాయిపేటలోని చిన్నగాంధీ బొమ్మవీధికి పక్కవీధిలో నివాసం ఉంటోంది. శనివారం ఉదయం లక్ష్మి ఇంట్లో పూజ చేస్తుండగా ప్రమాదవశాత్తూ దీపారాధన దీపం ఆమె చీరకు అంటుకుంది. ఆమె గమనించకపోవడంతో మంటలు వ్యాపించి తీవ్రంగా గాయపడింది. ఆమె కేకలు వేయడంతో స్థానికులు వచ్చి మంటలు ఆర్పి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే ఆమె పరిస్థితి విషమించి సాయంత్రం మృతిచెందింది. ఈ మేరకు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతిభ అవార్డుకు శ్యామ్‌కుమార్ ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న హెచ్ఎం పార్థసారథి

రంగంపేట, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షల్లో రంగంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థి కోశెట్టి శ్యామ్‌కుమార్ ప్రతిభ అవార్డుకు ఎంపికయ్యాడని హెచ్ఎం వి.పార్థసారధి తెలిపారు. శ్యామ్‌కుమార్ పదో తరగతిలో 584 మార్కులు సాధించి మండల స్థాయి ప్రథమస్థానంలో నిలిచాడన్నారు. ఈ నెల 9న రాజమహేంద్రవరంలో జరిగే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సన్మానం పొందబోతున్నాడన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని హెచ్ఎంతోపాటు ఉపాధ్యాయులు, విద్యాకమిటీ ఛైర్మన్ గెద్దాడ దుర్గారావు అభినందించారు.

పల్లా సింహాచలం మృతికి ఎంపీ పురందేశ్వరి సంతాపం

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ తండ్రి, మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం మృతి పట్ల బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బిక్కవోలు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): గత నెల 31న పందలపాకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గుడిమెట్ల శ్రీనివాసరెడ్డి(56) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడని ఎస్ఐ వి.రవి చంద్రకుమార్ తెలిపారు. ఈ ప్రమాదంలో రెడ్డి పైడారావు బైక్‌పై ధాన్యం ట్రాక్టర్‌ను ఓవర్ టేక్ చేస్తుండగా ట్రాక్టర్ డ్రైవర్ సిగ్నల్ ఇవ్వకుండా కుడివైపు తిప్పడంతో ట్రాక్టర్ వెనుక చక్రం కింద పడి పైడారావు అదే రోజు మృతి చెందాడు. బైక్‌పై లిఫ్ట్ ఎక్కిన శ్రీనివాసరెడ్డి కూడా తీవ్రగాయాలై రాయవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు.


50 లీటర్ల సారా స్వాధీనం

1800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం.. ఒకరి అరెస్టు

రంగంపేట, జూన్ 7(ఆంధ్రజ్యోతి): రంగంపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని జి.దొంతమూరు గ్రామంలో సారా స్థావరాలపై శనివారం పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా 50 లీటర్ల సారా, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. 1800 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేసి, గండి సూర్యనారాయణను అరెస్ట్ చేశామని, ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సీఐ సుధ పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారన్నారు.

గాయపర్చిన వ్యక్తిపై కేసు

కొవ్వూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తిని కొట్టి గాయపర్చిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు హెడ్‌కానిస్టేబుల్ లలితకుమారి తెలిపారు. రాజమహేంద్రవరంలోని రాజేంద్రనగర్‌కు చెందిన కొండాక తరుణ్ టాటా క్యాపిటల్ మైక్రో ఫైనాన్స్‌లో పనిచేస్తున్నాడు. ఈ నెల 6న కొవ్వూరు మండలం వాడపల్లి వచ్చి గెల్లా లక్ష్మి వద్ద ఈఎంఐ కట్టించుకుని వెళ్తూ పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో ఫోన్ మాట్లాడుతున్నాడు. ఇంతలో స్థలం యజమాని గెల్లా సతీష్. నా స్థలంలోకి ఎందుకు వచ్చావంటూ దౌర్జన్యం చేసి, సెల్‌ఫోన్ లాక్కొని తలపై కొట్టి గాయపర్చాడు. దీంతో స్థానికులు తరుణ్‌ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి సమాచారం, తరుణ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ తెలిపారు.



ఉపయోగాంధ్ర



కడియంలో మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల, కలెక్టర్ ప్రశాంతి తదితరుల యోగాసనాలు

కడియం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): అన్ని వయసుల వారు యోగా సాధన చేయాలని మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. కడియపులంక పుల్లా చంటియ్య - సత్యదేవా నర్సరీలో ఆదివారం యోగాంధ్ర నిర్వహించారు. పచ్చని వాతావరణంలో మంచి ఏర్పాట్లు చేసిన నర్సరీ అధినేత పుల్లా పెదసత్యనారాయణ, నర్సరీ సంఘం అధ్యక్షుడు రత్నం అయ్యప్పలను అభినందించారు. యోగసాధన వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని కలెక్టర్ ప్రశాంతి అన్నారు.కార్యక్రమంలో ఇన్‌చార్జి సర్పంచ్ పాటంశెట్టి రాంజీ, ఏఎంసీ ఉపాధ్యక్షుడు బోడపాటి గోపి, మార్గాని సత్యనారాయణ, పుల్లా వీరవెంకట్రావు, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, మాజీ సర్పంచ్ గట్టి నర్సయ్య, జేసీ చిన్నరాముడు,ఆర్డీవో కృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో శనివారం బక్రీద్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు.. నెహ్రూనగర్, సుబ్రహ్మణ్య మైదానంలో జరిగిన ప్రార్థనల్లో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.
- రాజమహేంద్రవరం కల్చరల్

బక్రీద్.. సంబరం



తాళ్లపూడి మండలం సూరయ్యపేటలో పునాది దశలో నిలిచిన ఇంటి నిర్మాణాలు

ఇచ్చేది చాలక.. ఇల్లు కట్టలేక!

పేదల గూడు..కష్టాలు బోలెడు

- సాయం రూ.2.30 లక్షలు
- అయ్యేది రూ.5.75 లక్షలు
- ముందుకు రాని ప్రజానీకం
- నెరవేరని నిర్మాణ లక్ష్యం
- అధికారులపై తీవ్ర ఒత్తిడి

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు..అన్నారు పెద్దలు.. ఆ రెండూ అంత కష్టమైన పనులన్న మాట... పెళ్లి మాటేమో కానీ.. ఇల్లు కట్టాలంటే మాత్రం ప్రస్తుత పరిస్థితుల్లో గగనంగా మారింది. ఒక వేళ కష్టపడిన కట్టినా పూర్తవకుండానే అమ్మేసుకుంటున్న వారెందరో.. ఇంటి నిర్మాణం అనేది సాధారణ, మధ్యతరగతి ప్రజలకు కలగానే మారింది. ప్రభుత్వం స్థలం ఇచ్చి ఇళ్లు కట్టుకోమన్నా కట్టుకోలేని స్థితిలో పేదలు ఉన్నారు.

రూ.1.80 లక్షలకు ఇల్లు కట్టగలమా?

2014లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేదల ఆర్థిక సమస్యలను గుర్తించి బ్యాంకు రుణం ఇప్పించి టిడ్కో ఇళ్లు నిర్మించారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ టిడ్కో ఇళ్లను మూలన పడేసి పేదలకు సెంటుభూమి ఇచ్చి అందులోనే రూ.1.80 లక్షతో ఇల్లు నిర్మించుకోవాలనే విధానాన్ని అమల్లోకి తెచ్చింది.సెంటు స్థలంలో రూ.1.80 లక్షలతో పునాది కూడా పడదు. అయినా చాలా మంది పేదలు అప్పో సప్పో చేసి ఇల్లు కట్టేసుకున్నారు.ప్రస్తుతం ఇళ్లను అమ్మేసుకుంటున్నారు.ఏ కాలనీకి వెళ్లినా ఇల్లు అమ్మబడును అనే బోర్డు లు దర్శనమిస్తున్నాయి.



సూరయ్యపేటలో అమ్మకానికి ఇల్లు

ఇల్లు కట్టాలంటే..అప్పు చేయాల్సిందే..

కూటమి ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి రూ.2.30 లక్షల వరకూ ఇస్తున్నా.. లబ్ధిదారులు ముందుకు రావడంలేదు. ఏదో కొద్దిగా ఆర్థిక స్తోమత ఉన్నవారు మాత్రమే ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారు.ఎందుకంటే గత జగనన్న కాలనీల్లో ఒక్కో లబ్ధిదారుకు ఇచ్చిన 51 గజాల్లో 20 టు 20 అడుగులు మేర ఇల్లు నిర్మించి రంగులతో సహా అందివ్వాలంటే రూ.5.75 లక్షలు అవుతుందని అంచనా ఉంది. బేస్‌మెంట్‌కు రూ.లక్షా 10 వేలు, కిటికీలు, గుమ్మాలు పెట్టి గోడలు కట్టడానికి మరో రూ.1 లక్షా 10 వేలు, శ్లాబ్‌కు రూ.1 లక్షా 20 వేలు,ప్లంబింగ్, ఎలక్ట్రికల్ వర్క్‌కు రూ.60 వేలు, ప్లాస్టింగ్‌కు రూ.ఒక లక్ష వరకూ అవుతుంది. ఇలా సాధారణంగా కట్టుకుంటే రూ.5.75 లక్షలు అవుతుంది. అయితే ప్రభుత్వం ఇచ్చేది రూ.2.30 లక్షలు అంటే మరో రూ.3.45 లక్షలు అప్పు చేయక తప్పని పరిస్థితి.దీంతో ఇంటి నిర్మాణానికి పేదలు ముందుకు రావడంలేదు. కట్టే ఇంటిపై బ్యాంకు రుణం ఇప్పిస్తే నెమ్మదిగా తీర్చుకుంటామని ఓ లబ్ధిదారుడు చెప్పడం గమనార్హం.

రూ.2.30 లక్షలు చేసినా ఇబ్బందే..

2024 సార్వత్రిక ఎన్ని కల్లో తెలుగుదేశం హయాంలో కూటమి ప్రభు త్వం అధికారంలోకి రావడంతో పేదలకు భారీ ఎత్తున సహాయ పడాలనే ఆలోచనకు వచ్చింది. ఎస్సీ, బీసీ లబ్ధిదార్లకు రూ.50 వేల వంతున, ఎస్టీలకు రూ.75 వేల వంతున ఆర్థిక సహాయం చేసినా పేదోడు ఇంటి నిర్మాణానికి ఖర్చు సరిపోవడంలేదు. దీంతో చాలా మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి ముందుకు రాలేకపోతున్నారు.తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఈనెల 12వ తేదీకి సామూహిక గృహ నిర్మాణాలకు శంకుస్థాపన చేయాలని ఆదేశించినా ఆర్థిక సమస్యలతో ముందుకు రావడంలేదు.లబ్ధిదారులను ఒప్పించాలని అధికారులు ప్రయత్నించినా వెనకడుగు వేస్తున్నారు.ఉన్నతాధికారులు టార్గెట్లు విధించడంతో సచివాలయ,హౌసింగ్, రెవెన్యూ అధికారులు, ప్రత్యేకాధికారులపై ఒత్తిడి తప్పడం లేదు.



రాజమహేంద్రవరంలో శనివారం ఎండమావులు

నై.. రుతు పవనాలు!

మొన్న మే నెలలో.. ఎక్కడ చూసినా హాయ్ హాయ్..పెద్దగా కానరాని సూరీడు..రోజంతా చల్లదనమే..మబ్బుల చాటున దాగిన సూరీడుతో మండుటెండలు మాయం.. అనేక చోట్ల వర్షాలు.. నిజంగానే ఇది మే నెలేనా అన్నట్టు కానరాని భారీ ఉష్ణోగ్రతలు..ఊసే లేని వడగాడ్పులు.. ఉక్కబోత...హమ్మయ్య ఈ వేసవి ఇక ముగిసిపోయింది.. అని జనం ఊపిరి పీల్చుకున్నారు... ఈలోపు రుతు పవనాల ఆగమనం... ఇక హాయి హాయి అనుకున్నారంతా.. కానీ!

జూన్‌లో చల్లదనమే అనుకున్నారంతా.. కానీ సూరీడు సుర్రుమంటున్నాడు.. ఉదయం నిద్రలేవగానే బయట ఉక్కబోత.. తీవ్రవేడి.. కానరాని వానలు.. ఎండలు జనానికి చుక్కలు చూపిస్తున్నాయి. రుతు పవనాలు వచ్చేశాయనుకుంటే వాన జాడ లేక జనం విలవిల్లాడిపోతున్నారు..

మే నెలలో హాయ్.. జూన్‌లో బాబోయ్!

- ఉక్కబోతతో జనం విలవిల
- సుర్రుమంటున్న సూరీడు
- ఏసీ రూమ్‌లకే జనం పరిమితం
- జూన్‌లో వింత వాతావరణం
- ఈ నెల 12న అల్పపీడనం

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

వాతావరణం మారింది.. ఏటా మే నెలో ఎండలు మండిపోతాయి..ఇళ్ల నుంచి బయటకే రాలేం.. జూన్ వచ్చే సరికి వర్షాలు ప్రారంభమై వాతావరణం కొంత చల్లబడుతుంది.ఏళ్ల తరబడి కనిపించే వాతావరణ పరిస్థితులు ఇవే.. అటు వాతావరణ శాఖ కూడా ఏటా మే నెలలో ఎండలు మండిపోతాయని..జూన్‌లో నైరుతి రుతుపవనాలతో పరిస్థితి కాస్త చల్లబడుతుందని చెబుతుంటారు.అదేం విచిత్రమో కానీ.. ఈ సారి వాతావరణం ఉమ్మడి జిల్లాలో జనాలకు చుక్కలు చూపిస్తోంది. మే లో చల్లచల్లని ఆహ్లాదం పంచి..ఇప్పుడు జూన్‌లో వేడి దంచేస్తుంది. వాతావరణశాఖ నిపుణులు సైతం గందరగోళానికి గురైన ప్రస్తుత పరిస్థితులపై రకరకాల విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి.

చల్లదనమే!

ఈ ఏడాది రొటీన్‌కు భిన్నంగా కాస్త చల్లదన'మే' అనిపించాయి. ఉదయం ఎంత భానుడు విశ్వరూపం చూపినా.. సాయంత్రమయ్యేసరికి మాత్రం వరుణుడు కూల్ చేసేవాడు. ప్రతి రోజూ ఉమ్మడి జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిశాయి. కాకినాడ, కోనసీమ, రాజమహేంద్రవరం నగరాల్లో మే నెలలో అనేక సార్లు భారీ వర్షాలతో వర్షపాతం ఏకంగా ఆరు సెంటీమీటర్ల వరకు నమోదైంది. ఈ మూడు జిల్లాల్లో ఏకంగా అనేక మండలాల్లో వరుసగా 8 రోజులు వర్షం కురిసింది. దీంతో మే నెలంతా చల్లచల్లగా గడిచింది.కాకినాడ జిల్లాలో ఏప్రిల్‌లో 16.4 మి.మీ వర్షపాతం నమోదుకావాల్సి ఉంటే 45.78 మి.మీ. కురిసింది. మేలో 109 మి.మీ.కు 115 మి.మీ. నమోదైంది. జూన్‌కు వచ్చేసరికి 8.1 మి.మీ. తక్కువ నమోదైంది.కోనసీమ జిల్లాలో మే నెలంతా కలిసి 72.55 మి.మీ. వర్షం కురవాల్సి ఉంటే 130 మి.మీ. కురిసింది. జూన్‌లో ఈ ఏడు రోజుల్లో ఒక్కరోజు వర్షం నమోదవలేదు.0.65 మి.మీ. లోటు కనిపిస్తోంది. తూర్పుగోదావరి జిల్లాలో మే నెలంతా కలిపి 78.56 మి.మీ. వర్షం కురవాల్సి ఉంటే 135.54 మి.మీ. కురిసింది. తీరా జూన్‌కు వచ్చేసరికి ఏడు రోజుల్లో 0.76 మి.మీ. లోటు కొనసాగుతోంది.

బాబోయ్ జూన్..

జూన్ నెల ఆరంభం కాగానే అంతా వర్షాలే అనుకున్నారు.తీరా చూస్తే ఎండలు మండిపోతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు 35 డిగ్రీల నుంచి 40 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. మూడు రోజులుగా సూరీడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు.ఆ ప్రచండభానుడి భగభగలతో ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు.ఉదయం ఆరు గంటల నుంచే వాతావరణం ఉక్కబోతగా ఉంటోంది. పది గంటలకే 'ఉక్క'రూపం దాల్చుతోంది. మధ్యాహ్నం పూర్తిగా నడినెత్తిన చేరుతోంది. ఇదే పరిస్థితి మరికొన్ని రోజులు ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.ఈ నెల పదో తేదీన పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడవచ్చని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు.ఈ నెల 12న బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందని అంచనా. ప్రస్తుత వాతావరణానికి కారణం మందగించిన రుతుపవనాల కదలికే అని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఇవి మందకొడిగా ఉండడమే ప్రస్తుత పరిస్థితికి కారణమని విశ్లేషిస్తున్నారు.

ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీలో జిల్లాకు 18వ స్థానం

రాజమహేంద్రవరం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలో మెరుగైన ఫలితాలు సాధించిన జిల్లా సప్లిమెంటరీలో 18వ స్థానంతో సరిపెట్టుకుంది. శనివారం వెలువడిన ఫలితాల ప్రకారం.. ప్రథమ సంవత్సరం జనరల్ విభాగంలో 3,891 మంది పరీక్షలు రాయగా 1,636(42%) మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ విద్యార్థులు 2,624 మంది హాజరు కాగా 1,437(55%) మంది..ఒకేషనల్‌లో మొదటి ఏడాది 819కి 394, రెండో ఏడాది 542కు 316 మంది పాసయ్యారు. రీవెరిఫికేషన్, రీకౌంటింగ్‌కి ఈ నెల 13 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి నరసింహం తెలిపారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

మంత్రి కందుల దుర్గేష్ ఆదేశం

రాజమహేంద్రవరం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు ఆర్‌వోబీ నిర్మాణ పనులు వేగవంతం చేసే క్రమంలో రైతులకు ఎలాంటి ఇబ్బందీ కలిగించడానికి వీల్లేదని.. అధికారులతో కూడిన నిపుణుల కమిటీ క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి తగిన ప్రతిపాదనలతో నివేదికను త్వరితగతిన అందజేయాలని మంత్రి కందుల దుర్గేష్ ఆదేశించారు.కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శనివారం కలెక్టర్ ప్రశాంతి, రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజనీరు వీపీఎస్ నాయుడుతో సమావేశం నిర్వహించారు. వంతెన నిర్మాణంలో రైతులు వెల్లడిస్తున్న అభ్యంతరాలకు సహేతుకమైన పరిష్కారాలు చూపాలన్నారు.కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ఇప్పటికే ప్రాజెక్టుకు సంబంధించి క్షేత్రస్థాయిలో సింగవరం, శెట్టిపేట,తాళ్లపాలెంలో గ్రామ సభలు నిర్వహించామన్నారు.ఈ వంతెన వల్ల జిల్లాకు ప్రత్యేక గుర్తింపు వస్తుందన్నారు.



ఏదీ ఫుట్‌పాత్ : రాజమహేంద్రవరంలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు





వాణిజ్య నగరం.. ప్రయాణం నరకం!

రాజమహేంద్రవరం వస్తే తప్పని ట్రాఫిక్ ఇక్కట్లు

- ఫుట్‌పాత్‌లని వదలని వ్యాపారులు
- ఎటెళ్లాలో తెలియక రోడ్డుపై జనం
- చాలా చోట్ల పనిచేయని సిగ్నల్స్
- ఎక్కడపడితే అక్కడే పార్కింగ్‌లు
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరం నగరంలో ట్రాఫిక్ సమస్య భయపెడుతోంది..ఎవరిష్టం వారిదే.. ట్రాఫిక్ సిగ్నల్స్ ఉన్నా పనిచేయవు.. పనిచేసినా పట్టించుకోరు. పలు చోట్ల ఫుట్‌పాత్‌లు ఆక్రమణ, పార్కింగ్ స్థలాలు లేకపోవడం వంటి సమస్యలతో సిటీ సతమతమవుతోంది. 7 లక్షల జనాభా ఉన్న వాణిజ్య నగరానికి ప్రతి రోజూ వేలాదిగా బయట నుంచి జనం వచ్చి వెళుతుంటారు. వాహనాలను ఇష్టానుసారం రోడ్లపై పెట్టేస్తున్నారు. ప్రజలు నడవడానికి వీలుగా నిర్మించిన ఫుట్‌పాత్‌లు ఆక్రమించేస్తున్నారు. ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేస్తున్నారు. లాలా చెరువు రోడ్డులో కార్ల షోరూమ్‌లు, మెకానిక్‌లు తమ వాహనాలు ఏకంగా ఫుట్‌పాత్‌ల మీదే పార్కింగ్ చేయడం గమనార్హం. ట్రాఫిక్ పోలీసుల విధానం సక్రమంగా ఉన్నట్టు లేదు. ఎవరూ ట్రాఫిక్ సమస్యపై దృష్టి పెట్టడడం లేదు. చాలా జంక్షన్లలో ట్రాఫిక్ సిగ్న ల్స్ లేవు. బస్సు రూట్‌లు హైవేకే మళ్లిస్తే ట్రాఫిక్ సమస్య తీరుతుంది. కడియపులంక, వేమగిరి, బొమ్మూరు, ఫోర్త్ బ్రిడ్జి, దివాన్ చెరువు సెంటర్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ అభివృద్ధి చేయవలసి ఉంది. ఫుట్ పాత్‌లు ఆక్రమించే వారి జోలి కి మాత్రం సిటీ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ వెళ్లక పోవడం గమనార్హం.చిరు వ్యాపారులు ము నిసి పల్ సిబ్బంది,సిటీ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్, పో లీసులకు నెలవారీ మామూళ్లు ఇవ్వాల్సిందే. 2027లో గోదావరి పుష్కరాలు వస్తున్నాయి. ఆలోగానే ట్రాఫిక్ సమస్యకు ఒక పరిష్కారం చూపాల్సి ఉంది. లేదంటే ప్రమాదమే. అధికారులు కాస్త ముందుగా మేల్కొంటే సమస్యను పరిష్కరించే అవకాశం ఉంటుంది. అప్పుడు చేద్దామంటే హడావుడి తప్ప ఏమీ ఉండదు.



ఇరుకుగా దేవీచౌక్



నడవడానికే చోటులేదు : ఇదీ రాజమహేంద్రవరం మెయిన్‌రోడ్డు

10న టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం

వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

రాజమహేంద్రవరం, జూన్7(ఆంధ్రజ్యోతి): యువత, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, విద్యార్థుల ద్వారా ప్రతిపాదించే నూతన ఆవిష్కరణలకు ఆర్థిక, సాంకేతిక చేయూత ఇవ్వడానికి రతన్‌టాటా ఇన్నో వేషన్ హబ్ (ఆర్టీహెచ్) కార్యాలయం ఏర్పాటు చేస్తున్నట్టు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్ బొమ్మూరులో అందంగా తయారు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ కార్యాలయంలో కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.ఈ కేంద్రాన్ని ఈ నెల 10న సీఎం చంద్రబాబు వర్చువల్‌గా ప్రారంభిస్తారన్నారు. ఈ మేరకు రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు కాటంనేని భాస్కర్, పీఎస్ ప్రద్యుమ్న జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో శనివారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ ఆర్టీహెచ్‌కు లీడ్ పార్టనర్‌గా గ్రీన్‌కో ఉందన్నారు. ఈ హబ్ కోసం ఐదుగురు ప్రతినిధులు, ఇద్దరు స్వతంత్ర నిపుణులతో ప్రమోషన్ కోసం టీమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, పరిశ్రమ నిర్వాహకుల సంఘాల నుంచి ఇద్దరు ప్రముఖులను ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. దిశ, పాలనను పర్యవేక్షించే బాధ్యత, పెట్టుబడి, ఫైనాన్సింగ్ భాగస్వామ్యం, ఇంక్యుబేషన్, అండ్ యాక్సిలరేషన్, వాటాదారుల నిర్వహణ విషయంలో తగిన మార్గదర్శకం ఉండేలా హబ్ కార్య కలాపాలు ఉంటాయన్నారు.ఈ హబ్ ఏర్పాటు, నిర్వహణ విషయంలో సహ భాగస్వామ్యం, కార్పస్ ఫండ్ రూ.30కోట్లతో వెంచర్ క్యాపిటల్ ఫండ్ ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తారని చెప్పారు.



ముస్తాబవుతున్న టాటా ఇన్నోవేషన్ కేంద్రం

జిల్లాకు 42 కిసాన్ డ్రోన్లు మంజూరు

రాజమహేంద్రవరం రూరల్ జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సబ్సిడీపై కిసాన్ డ్రోన్లతో గ్రామ వ్యవసాయ యంత్రాల బ్యాంకుల స్థాపన రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేసిందని కలెక్టర్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయ యాంత్రీకరణ రైతు కృషి విజ్ఞాన యోజన 2024-25 పథకంలో 42 కిసాన్ డ్రోన్లను మంజూరు మంజూరు చేయడం జరిగిందన్నారు. డ్రోన్ యూనిట్స్ ఏర్పాటుకు ఐదుగురు సభ్యులు కలిగిన రైతు సీహెచ్‌సీలో సభ్యుల ఆమోదంతో ఒకరికి డ్రోన్ టెక్నాలజీ పైలెట్‌గా శిక్షణ ఇస్తారన్నారు. అభ్యర్థి వయసు 18 నుంచి 50 సంవత్సరాల్లోపు ఉండి ఇంటర్మీడియట్ అర్హత ఉండాలన్నారు. రైతు సీహెచ్‌సీ సభ్యులు వివరాలు ధ్రువీకరించిన తరువాత వ్యవసాయాధికారుల ద్వారా జిల్లా కలెక్టరు ఆమోదం నిమిత్తం సిఫారసు చేస్తారన్నారు. జిల్లాకు 42 డ్రోన్ యూనిట్స్ మంజూరు కాగా ప్రస్తుతం 32 డ్రోన్లకు అనుమతివ్వడం జరిగిందన్నారు. ఇప్పటికే 12 డ్రోన్స్ ఏర్పాటు చేయడం జరిగిందని మరో 12 డ్రోన్లు పంపిణీకి సిద్ధం చేయడం జరిగిందన్నారు. చాగల్లు మండలం 1, గోపాలపురం మండలం-1, నల్లజర్ల మండలం-3, రంగంపేట మండలం-1, ఉండ్రాజవరం మండలం-1, తాళ్ళపూడి మండలం-1, గోకవరం మండలం-2, సీతానగరం మండలం-1, దేవరపల్లి మండలం-1 ఉన్నాయన్నారు.

యోగాతో ఆరోగ్యానికి ఎంతో మేలు : చైర్‌పర్సన్



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రత్నకుమారి

కొవ్వూరు, జూన్ 7 (ఆంధ్ర జ్యోతి): ప్రతి రోజూ యోగా చేయ డం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని మున్సిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి అన్నారు. కమిష నర్ టి.నాగేంద్రకుమార్ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర 2025 కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. స్థానిక ఆంధ్రగీర్వాణ విద్యా పీఠం ప్రాంగణంలోని సంస్కృత కళాశాలలో యోగాపై నిర్వహించిన అవగాహన సదస్సుకు చైర్‌పర్సన్ రత్నకుమారి ముఖ్యఅతిథిగా పా ల్గొని యోగాపై అవగాహన కల్పించారు. యోగా శిక్షకులు పెనుమత్స సరోజిని, యోగేంద్ర సదస్సులో పాల్గొన్న వారికి యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం. దుర్గాప్రసాద్, ఎంఈవో రామకిషోర్, ఉపాధ్యాయులు కె. సౌజన్య, వార్డు సెక్రటరీలు, హెల్త్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యం కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

నల్లజర్ల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): చీపురుగూడెంకి చెందిన జనసేన నాయకుడు చెల్లు సుబ్రహ్మణ్యం కుమారుడు లీలాకృష్ణప్ర సాద్ ఇటీవల కలుపు మందు పడి మృతిచెం దిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆ కుటుంబ సభ్యులను శనివా రం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు వెళ్లి పరామర్శించారు. అనంతరం ప్రసాద్ చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈయనతోపాటు ఎంపీటీసీ రావూరి వెంకట రమణ, టీడీపీ గ్రామ అధ్యక్షుడు చెల్లు పెద్దరామన్న, కార్యదర్శి మోదుగ సుబ్బారావు, చెల్లు వీరవెంకట్రావు, చెల్లు సత్యనారాయణ, కోలా రామకృష్ణ, తలంశెట్టి చిన్న వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

చివటంలో అమ్మవార్ల విగ్రహాల ప్రతిష్ఠ

ఉండ్రాజవరం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): చివటంలో నూతనంగా నిర్మించిన వుంతలో ముసలమ్మ, కనకదుర్గ ఆలయాన్ని శనివారం ప్రారంభించారు. ఇందులోభాగంగా వుంతలో ముసలమ్మ, కనకదుర్గ అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలను నిర్వహించారు. ఆదివారం అమ్మవారి ఆలయం వద్ద అఖండ అన్నసమారాధన నిర్వహించనున్నారు. ఆలయ కమిటీ సభ్యులు దాసరి మునిరాజు, నాగేశ్వరరావు, ఎం. మురళీకృష్ణ, కోలా సుబ్రహ్మణ్యం, గణపతి, గంటిన వెంకన్న, కూనపరెడ్డి నారాయణ, సీహెచ్ కుమారస్వామి ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.



విగ్రహాలకు పూజలు చేసిన దృశ్యం

ఏడుగురు విద్యార్థులకు షైన్‌స్టార్ ప్రతిభా అవార్డులు

తాళ్లపూడి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు షైన్‌స్టార్ ప్రతిభా అవార్డు 2025 సంవత్సరానికి మండలంలో పలు పాఠశాల నుంచి ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారని ఎంఈవో సీహెచ్ బాలామణి తెలిపారు. తాళ్లపూడి మాంటిస్సోరీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల నుంచి శిరిగినీడి సత్యదేవ్, చెరుకు సుమాంజలి, బండారు మేషన, కూన రేణుక, మేకా లక్ష్మీభవ్య, మలకపల్లి ఉన్నత పాఠశాల నుంచి జొన్నకూటి అజయ్ కుమార్, పెద్దేవం ఉన్నత పాఠశాల నుంచి సూరెడ్డి సాత్విక్‌హర్ష ఎంపికయ్యారు. వీరంతా ఈనెల తొమ్మిదో తారీఖు ఉదయం 10 గంటలకు రాజమ హేంద్రవరంలోని వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో హాజరవ్వాలని, అక్కడ అవార్డులు అందజేయడం జరుగుతుందని ఎంఈవో తెలిపారు.

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

సోమాలమ్మ జాతర మహోత్సవాలు

కొవ్వూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నందమూరు గ్రామదేవత సోమాలమ్మ వారి జాతర మహోత్సవాలు రెండోరోజైన శనివారమూ కొనసాగాయి. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ పురవీధుల్లో అమ్మవారిని ఊరేగించారు. రాత్రికి బలిచేట తిప్పారు. జాతర ముగింపు సందర్భంగా ఆదివారం అమ్మవారికి మొక్కులు, నైవేద్యాలు సమర్పించడం జరుగుతుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

కొవ్వూరు మున్సిపాల్టీ టీడీపీ కైవసం

- వైసీపీకి మున్సిపల్ చైర్‌పర్సన్, ముగ్గురు కౌన్సిలర్లు రాజీనామా
- త్వరలో సీఎం చంద్రబాబు సమక్షంలో చేరనున్నట్టు ప్రకటన
- టీడీపీ సీనియర్ నేత పెండ్యాల అచ్చిబాబు, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును కలిసి పుష్పగుచ్ఛాలు అందజేత
- జిల్లాలోని రెండు మున్సిపాల్టీలూ కూటమి ఖాతాలోకి



పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నకుమారి, కౌన్సిలర్లు

కొవ్వూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు మున్సిపాల్టీ టీడీపీ వశమైంది. తాజాగా వైసీపీకి చెందిన చైర్‌పర్సన్‌తో పాటు ముగ్గురు కౌన్సిలర్లు రాజీనామా చేస్తున్నట్టు శనివారం ప్రకటించారు. ఇందులో చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, మూడో వార్డు కౌన్సిలర్ వరిగేటి లలితకుమారి, 10వ వార్డు కౌన్సిలర్ బత్తి నాగరాజు, 15వ వార్డు కౌన్సిలర్ అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర ఉన్నారు. అలాగే మాజీ కౌన్సిలర్ బావర రాజేష్ (బెన్ని), వరిగేటి సుధాకర్ తమ వ్యక్తిగత కారణాలతోపాటు పట్టణాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని వైసీపీకి రాజీనామా చేస్తున్నట్టు పాత్రికేయుల సమావేశంలో తెలిపారు. అనంతరం స్థానిక టీడీపీ కార్యాలయానికి చేరుకుని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, సీనియర్ టీడీపీ నేత పెండ్యాల అచ్యుతరామయ్య (అచ్చిబాబు)ను కలుసుకుని పుష్పగుచ్ఛాలు అందించారు. దీనిపై ఎమ్మెల్యే ముప్పిడి మాట్లాడుతూ త్వరలో సీఎం చంద్రబాబు సమక్షంలో నలుగురిని పార్టీలో చేర్చుకోనున్నట్టు తెలియజేశారు.

● అంతర్గత కలహాలే కారణమా :

మున్సిపాల్టీలోని వైసీపీ పాలకవర్గ సభ్యుల మధ్య గత కొంతకాలంగా అంతర్గతంగా విబేధాలు కొనసాగుతున్నాయి. అంతేకాకుండా పార్టీలో ఆది నుంచి కొనసాగుతున్న వర్గ విభేదాలను సరిదిద్దడంలో మాజీ హోంమంత్రి తానేటి వనిత, తర్వాత కొవ్వూరు నియోజకవర్గ కన్వీనర్‌గా వచ్చిన మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు చొరవ తీసుకోకపోవడంతో నేడు వైసీపీ మున్సిపాల్టీని కోల్పోవాల్సి వచ్చిందని పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి. మొన్న ఎంపీపీ కాకర్ల నారాయుడు, జడ్పీటీసీ బొంతా వెంకటలక్ష్మి, నిన్న నియోజకవర్గ పరిశీలకుడు ఎస్. రాజీవ్ కృష్ణ తమ అభిమానులతో వైసీపీకి రాజీనామా చేసి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. తాజాగా మున్సిపల్ చైర్‌పర్సన్ బావనరత్నకుమారి, కౌన్సిలర్లు రాజీనామా చేశారు దీంతో మున్సిపాల్టీలో కూటమి సభ్యుల బలం పెరగడంతో దాదాపు టీడీపీ సొంతం అయ్యిందనడంలో ఎలాంటి సందేహం లేదు. నిన్న నిడదవోలు మున్సిపాల్టీని జనసేన కైవసం చేసుకోగా, నేడు కొవ్వూరు మున్సిపాల్టీని టీడీపీ కైవసం చేసుకోవడం లాంఛనంగా మారింది. దీంతో జిల్లాలో ఉన్న ఈ రెండు మున్సిపాల్టీలు కూటమి ఖాతాలో చేరనున్నాయి.

● మెజార్టీ కోల్పోయిన వైసీపీ...

గత ఎన్నికల్లో మున్సిపాల్టీలో 23 వార్డులు ఉండగా వైసీపీ 15, టీడీపీ 7, బీజేపీ ఒకటి గెలుచుకున్నాయి. వైసీపీ నుంచి చైర్‌పర్సన్‌గా బావన రత్నకుమారి ఎన్నికయ్యారు. తాజాగా వైసీపీ బలం 15 నుంచి 11కి పడిపోయింది. టీడీపీ సంఖ్య 7 నుంచి 11కు చేరింది. బీజేపీ 1, ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఎమ్మెల్యే ఓటుతో కలుపుకుని కూటమి బలం 13కు చేరింది.

● 10వ వార్డు కౌన్సిలర్ బత్తి నాగరాజు మాట్లాడుతూ 2014, 19, 24 ఎన్నికల్లో వైసీపీ తరపున పనిచేశాను. ప్రస్తుతం కౌన్సిలర్‌గా ఉన్నాను. వైసీపీలో బీసీలకు సముచిత స్థానం కల్పించడం లేదు. గత ఎన్నికల్లో వైసీపీ 15వార్డుల్లో విజయం సాధించి మున్సిపాల్టీని కైవసం చేసుకున్నప్పటికీ చైర్‌పర్సన్ పదవి ఎస్సీలకు రిజర్వు అయ్యింది. రెండు వైస్‌చైర్మన్ పదవులు ఉండగా ఒక్కటి కూడా బీసీలకు ఇవ్వకుండా రెండూ ఓసీలకే కట్టబెట్టారు. దీంతో మనస్థాపం చెంది రాజీనామా చేసి టీడీపీలో చేరుతున్నాను.

● 15వ వార్డు కౌన్సిలర్ అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర మాట్లాడుతూ వార్డు ప్రజలు, అభిమానుల కోరిక మేరకు టీడీపీలో చేరుతున్నాను. కొవ్వూరు పట్టణాభివృద్ధి, రాష్ట్ర రాజధాని అమరావతిని అభివృద్ధి చేయడం ఒక్క సీఎం చంద్రబాబుతోనే సాధ్యమన్నారు.

ఎమ్మెల్యే ముప్పిడి మాట్లాడుతూ సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్చిబాబు సమక్షంలో త్వరలోనే సీఎం చంద్రబాబు వద్దకు తీసుకువెళ్లి పార్టీ కుటుంబ సభ్యులుగా చేర్చుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, ఎంపీపీ కాకర్ల నారాయుడు, సూర్యదేవర రంజిత్, మరపట్ల కళాధర్, మద్దిపట్ల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్



నల్లజర్ల మీనార్ మసీదు వద్ద ఆత్మీయంగా కలుసుకున్న ముస్లిం చిన్నారులు

కొవ్వూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పట్టణం, మండలంలో ముస్లిం సోదరులు ఎంతో భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండుగను శనివారం జరుపుకున్నారు. స్థానిక జామియా మసీదు, సత్యవతినగర్‌లోని మర్కజ్ మసీదులతో పాటు ఔరంగాబాద్, దొమ్మేరు, కాపవరం, గోవర్దనగిరి మెట్ట మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఈ సందర్భంగా పలువురు మతపెద్దలు మాట్లాడుతూ త్యాగానికి ప్రతీక బక్రీద్ అన్నారు.

నల్లజర్ల: బక్రీద్ పండుగను శనివారం భక్తిశ్రద్ధలతో ముస్లింసోదరులు జరుపుకున్నారు. మినార్ మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మసీదు ఇమాన్ సుభాన్ మాట్లాడుతూ బక్రీద్ అంటే త్యాగాలపండుగ అన్నారు. మసీదు అధ్యక్షుడు షేక్‌రఫీ, షేక్‌సర్దార్, ఎండీ ఇలియాజ్ షరీఫ్, ఎండీ ఆలీ సాహెబ్ పాల్గొన్నారు.

దేవరపల్లి: మండలంలో శనివారం బక్రీద్ పండుగను ముస్లింసోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అన్ని మసీదుల్లో ప్రత్యేక నమాజ్‌లు చేశారు. దేవరపల్లి, దుద్దుకూరు, లక్ష్మీపురం, రంగరాయ కాలనీ, యాదవోలు, గౌరీపట్నం, త్యాజంపూడిలో వేడుకలు జరిగాయి. బక్రీద్ త్యాగానికి ప్రతీక అని ముస్లింసోదరులు అన్నారు. కార్యక్రమంలో ఎస్‌కే ఖాదర్‌వల్లి, ఎస్‌కే బాషా, ఇస్మాయిల్, పఠాన్ బాజీ, షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీపురం మసీదులో నమాజ్ చేస్తున్న ముస్లిం సోదరులు

ఉండ్రాజవరం: మండలంలో ముస్లిం సోదరులు శనివారం బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉండ్రాజవరంతోపాటు మోర్త, వేలివెన్ను, చివటం, చిలకపాడు, తదితర గ్రామాల్లోని మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. త్యాగానికి సూచనగా ఈ పండుగను ముస్లిం సోదరులు జరుపుకున్నారు. ఒకరినొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. పెద్దసంఖ్యలో ముస్లింసోదరులు పాల్గొన్నారు.

శేషారావును కలిసిన ఆరమిల్లి



వేలివెన్నులో శేషారావును కలిసిన దృశ్యం

ఉండ్రాజవరం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): తణుకు ఎమ్మెల్యే ఆరమిల్లి రాధాకృష్ణ శనివారం వేలివెన్నులో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావును మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నైపుణ్యాభివృద్ధి సంస్థను మరింత అభివృద్ధి చేసేందుకు కృషిచేయాలని రాధాకృష్ణ కోరారు. అనంతరం వెంకటేశ్వరస్వామి ఫొటోను శేషారావుకు అందజేశారు. ఆయన వెంట తణుకు నియోజవర్గానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

కోటసత్తెమ్మ సన్నిధిలో శేషారావు పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న చైర్మన్ శేషారావు దంపతులు

నిడదవోలు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): తిమ్మరాజుపాలెంలో వేంచేసి వున్న కోట సత్తెమ్మ వారిని శనివారం రాష్ట్ర స్కిల్ డెవలప్మెంటు కార్పొ రేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు తన కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు శేషారావు దంపతులకు వేద ఆశీర్వాదాలు అందజేశారు. ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ దేవుల పల్లి రవిశంకర్ ఆలయ ఆచార ప్రకారం శేషారావు దంపతులను సత్కరించారు. బూరుగుపల్లి శ్రీనివాస్, టీడీపీ మండల అధ్యక్షుడు వెలగన సూర్యారావు, దేవస్థానం సూపరింటెండెంట్ జల్లా సోమరాజు పాల్గొన్నారు.

యోగాసానాల్లో పెన్షనర్ల సంఘం ప్రతినిధులు



యోగాసనాల్లో పెన్షనర్ల సంఘ ప్రతినిధులు

నిడదవోలు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ పెన్షనర్ల సంఘ ప్రతినిధులు యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో కీర్తి ఆంజనేయులు, పొన్నా సుబ్రహ్మణ్య శర్మ, కొప్పుల వెంకటేశ్వరరావు, ఎంఎస్ నాగేశ్వరరావు, ఖండవల్లి రంగాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

రేగులమ్మవారి జాతర ప్రారంభం

గోపాలపురం, జూన్7 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం గ్రామదేవత రేగులమ్మవారి జాతర మహోత్సవం అంగరంగ వైభవంగా శనివారం ప్రారంభమైంది. 18 ఏళ్ల తరువాత జాతర జరుగుతుండడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామానికి చెందిన ఆడపడుచులు బంధువులు, స్నేహితులు పెద్దసంఖ్యలో రావడంతో జనసందోహం నెలకొంది. ఆలయం నుంచి అమ్మవారిని తీన్‌మార్ డప్పులు, విచిత్ర వేషధారణలు, కేరళ డప్పు వాయిద్యాలు, బాణసంచా కాల్చివేత, గరగనృత్యాలతో గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. రాత్రి ఎనిమిది గంటల నుంచి అమ్మవారిని నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు ఘన సత్కారం



ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్‌ను సత్కరిస్తున్న దళిత నేతలు

కొవ్వూరు, జూన్ 7 (ఆంధ్ర జ్యోతి): ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మాజీ మంత్రి కేఎస్ జవహర్‌ను దళిత వర్గాల ఫెడరేషన్ నాయకులు శనివారం సత్కరించారు. దళిత వర్గాల ఫెడరేషన్ నాయకులు చెట్టే రాజు ఆధ్వర్యంలో గజమాలతో సత్కరించి, అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో పి. బాలకృష్ణ, ఎం. కిషోర్‌బాబు, ఎం. కృష్ణబాబు, ఎం. అచ్చిబాబు, బాలు, సంజయ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత్ ఎంప్లాయిస్ నాయకులు, బిషప్ ఇజ్రాయిల్ రాజు, పాస్టర్ ఆనందపాల్, కొవ్వూరు ఫైబర్‌నెట్ కేబుల్ నిర్వాహకులు మైపాల రాంబాబు మర్యాదపూర్వకంగా కలుసుకుని అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి , సీనియర్ టీడీపీ నేత అచ్చిబాబు

కొవ్వూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్యానికి కూటమిప్రభుత్వం పెద్దపీట వేస్తోందని నియోజకవర్గ టీడీపీ సీనియర్ నేత పెండ్యాల అచ్యుతరామయ్య (అచ్చిబాబు) అన్నారు. శనివారం కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, అచ్చిబాబు కలిసి పంపిణీ చేశారు. కొవ్వూరు మండలం పశివేదలకు చెందిన చింతకింద రామ్మోహన్‌కు రూ. 1,83,994, చాగల్లు మండలం చిక్కాలకు చెందిన కారింకి దామోదరానికి రూ. 92,226, చాగల్లుకు చెందిన డొక్కు ముత్యాలరావుకు రూ.1,42,969, జక్కు ఉమా దివ్యానికి రూ. 80,000 చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, బేతిన నారాయణ, గారపాటి శ్రీనివాసరావు, రామచంద్రరావు, పరిమి మురళీ గణేష్, తుంపల్లి ఆదినారాయణ, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

మానవత సంస్థ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

నల్లజర్ల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మానవత సంస్థ నూతన కమిటీ శనివారం భీమడోలులో ఆ సంస్థ వ్యవస్థాపకుడు ఎన్. రామచంద్రారెడ్డి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లా అధ్యక్షుడిగా నల్లజర్ల వాసి కండెపు వెంకట సూర్యనారాయణ, మండలాధ్యక్షుడిగా పాకలపాటి వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా ప్రత్తిపాటి రాంబాబు, కోశాధికారిగా ఐడీపీ అప్పారావు, ఉప కార్యదర్శిగా వల్లిరెడ్డి సతీష్, ఉపాధ్యక్షుడిగా మద్దూరి విష్ణుమూర్తి, బోడిగర్ల సీతారాములు, ఉన్నమట్ల శ్రీనివాసరావు, ప్రమాణ స్వీకారం చేసిన వారిలో ఉన్నారు. బోగవల్లి వెంకట సుబ్బారావు, గుళ్లపూడి వెంకట రత్నం, ఎన్. రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సీలేరునదిలో యువకుడి గల్లంతు.. గాలింపు చర్యలు ముమ్మరం

మోతుగూడెం, జూన్7 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతాల సందర్శనకు వచ్చిన యువకులు ప్రమాదంలో చిక్కుకున్న సంఘటన అల్లూరి జిల్లా మోతుగూడెం పరిధిలోని ధారాలమ్మ పిక్నిక్ స్పాట్ వద్ద జరిగింది. వివరాల్లోకి వెళ్తే తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి గ్రామానికి చెందిన 20 మంది తాపీ పనిచేసే వ్యక్తులు శనివారం ఉదయం చింతూరు మండలం మోతుగూడెం పర్యాటక ప్రాంతాల సందర్శనకు రెండు టాటా మ్యాజిక్ వాహనాలపై వచ్చారు. మోతుగూడెం ధారాలమ్మ పిక్నిక్ స్పాట్ వద్ద సీలేరు నదిలో నీటిప్రవాహం తక్కువగా ఉండటంతో నది మధ్యలోకి ఐదుగురు యువకులు వెళ్లి స్నానానికి దిగారు. అదే సమయంలో పొల్లూరు జలవిద్యుత్‌కేంద్రంలో జెన్‌కో ఉన్నతాధికారులు విద్యుదుత్పత్తిని ప్రారంభించటంతో ఒక్కసారిగా నీటిప్రవాహం పెరిగిపోయింది. అందులో అభిలాష్ (18) అనే యువకుడు గల్లంతయ్యాడు. అతని కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. మిగతావారు బయటపడ్డారు.

కానూరు కల్వర్టు పనులు ప్రారంభం

- ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా రోడ్డు తవ్వకం
- వాహనదారుల ఇక్కట్లు



కానూరు ఆర్‌అండ్‌బీ రోడ్డుపై కల్వర్టు పనులు చేపడుతున్న దృశ్యం

పెరవలి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): నిడదవోలు -నరసాపురం రోడ్డులోని కానూరు వద్ద గల ఆర్ అండ్‌బీ రోడ్డుపై కల్వర్టు పనులను ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా శనివారం సాయంత్రం ఒక్కసారిగా ప్రారంభించడంతో ఈ మార్గం గుండా ప్రయాణించే వాహనదారులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొన్నారు. కానూరులో వర్షాకాలం వచ్చే సమయంలో వరి చేలు తీవ్ర ముంపునకు గురి కావడంతో గతంలో రాష్ట్ర మంత్రి దుర్గేష్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. దీంతో మంత్రి స్వయంగా వచ్చి పరిశీలించారు. కల్వర్టు పూడుకుపోవడంతో నీరు లాగ డం లేదని రైతులు ఆయనకు విన్నవించారు. ఈ మేరకు సుమారు రూ. 40 లక్షలతో పనులు చేపట్టడం వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. కాగా ఈ రోడ్డు గుండా వందలాది లారీలు , బస్సులు , ఆటోలు , కార్లు మోటారు సైకిళ్ల రాకపోకలు సాగించేవవి... ఇలా ఇక్కడ పనులు ఒక్కసారిగా చేపట్టడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పత్రికల ద్వారా గానీ, సామాజిక మాధ్యమాల ద్వారా ఎటువంట హెచ్చరికలు చేయకపోవడం దారుణమని వారంతా ఆవేదన వ్యక్తం చేశారు.

శేషారావును కలిసిన టీడీపీ నాయకులు



శేషారావును సత్కరిస్తున్న కొవ్వూరు టీడీపీ నాయకులు

కొవ్వూరు, జూన్7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావును కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ నేతలు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, అర్బన్‌బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

తలపై కొట్టి గాయపర్చిన వ్యక్తిపై కేసు

కొవ్వూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ మాట్లాడుకుంటున్న వ్యక్తిపై దౌర్జన్యం చేసి కొట్టి గాయపర్చిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు పట్టణ హెచ్‌సీ లలితకుమారి తెలిపారు. రాజమహేంద్రవరంలోని రాజేంద్రనగర్‌కు చెందిన కొండాక తరుణ్ టాటాక్యాపిటల్ మైక్రో ఫైనాన్స్‌లో పనిచేస్తున్నాడు. ఈనెల 6వ తేదీన కొవ్వూరు మండలం వాడపల్లి వచ్చి గెల్లా లక్ష్మీ అనే ఆమె వద్ద ఈఎంఐ కట్టించుకుని వెళ్తూ పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో నిలబడి ఫోన్ మాట్లాడుతున్నాడు. ఇంతలో స్థల యజమాని గెల్లా సతీష్ నా స్థలంలోకి ఎందుకు వచ్చావంటూ దుర్భాషలాడుతూ సెల్‌ఫోన్ లాక్కొని తలపై కొట్టి గాయపర్చాడు. స్థానికులు గాయపడిన తరుణ్‌ని చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేశామని హెచ్‌సీ తెలిపారు.

పిల్లాడిని ఎందుకు ... కొడుతున్నావ్ అన్నందుకు కత్తితో దాడి

కొవ్వూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఒక వ్యక్తిని కత్తితో దాడిచేసి గాయపర్చడంతో కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ పి. విశ్వం తెలిపారు. వివరాలివి.... దొమ్మేరుకి చెందిన పోతుల వెంకటేష్ శనివారం రాత్రి తన కొడుకుని కొడుతున్నాడు. పక్క ఇంటిలో ఉంటున్న మల్లిన సతీష్ ఎందుకు పిల్లాడిని అలా కొడుతున్నావని అడిగాడు. దీంతో వెంకటేష్ కోపోద్రిక్తుడై కత్తి తీసుకొచ్చి నా కొడుకుని కొడుతుంటే నీకెందుకు అంటూ చెవిపై గాయపర్చాడు. దీంతో సతీష్‌ను చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి వచ్చిన సమాచారం, సతీష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.